హైదరాబాద్ వార్త

విచారణ సరే.. చర్యలేవీ..?

- జిహెచ్ఎంసిలో విజిలెన్స్ నివేదికలపై జోరుగా చర్చ
- పలువిభాగాల అధికారులపై వరుసగా ఫిర్యాదులు
- సదరు ఆఫీసర్లపై కమిషనర్ కర్ణన్ విచారణకు ఆదేశం
- రిపోర్టు అందినా చర్యలు తీసుకోకపోవడం పట్ల అనుమానాలు

హైదరాబాద్, జూన్ 3,ప్రభాతవార్త: జీహెచ్ఎంసీలో జరుగుతున్న అవకతవకలపై వరుసగా విజిలెన్స్ విచారణలు జరుగుతున్నాయి.కానీ చర్యలు మాత్రం కనిపించడంలేదనే చర్చ బల్దియాలో జోరుగా సాగుతోంది. కమిషనర్ ఆదేశాలతో పలు విభాగాల్లో విచారణలు జరిగినప్పటికీ... వాటి నివేదికలు ఎక్కడ..? బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు..? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఖైరతాబాద్ జోన్‌లో అధికారుల వ్యవహారాల నుంచి ఆస్తి పన్ను విధింపులో భారీ అసమానతల వరకు జీహెచ్ఎంసీలో బయటపడుతున్న అంశాలు సంచలనంగా మారుతున్నాయి. విజిలెన్స్ విచారణలు కేవలం హెచ్చరికలకే పరిమితమవుతున్నాయా.? లేక అక్రమాలపై కఠిన చర్యలకు రంగం సిద్ధమవుతోందా..? గ్రేటర్‌లో ఇప్పుడు ఇదే హాట్ టాపిక్‌గా మారింది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఇటీవల అవకతవకలు, అక్రమాలపై వరుస ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. దీంతో పలువురు అధికారులపై, వివిధ విభాగాల్లో జరిగిన వ్యవహారాలపై కమిషనర్ ఆర్వీ కర్ణన్ విజిలెన్స్ విచారణలకు ఆదేశించారు. అయితే విచారణలు పూర్తయినా... బాధ్యులపై చర్యలు తీసుకున్న దాఖలాలు మాత్రం కనిపించడం లేదన్న చర్చ అధికార వర్గాల్లో జోరుగా సాగుతోంది. దీంతో విజిలెన్స్ విచారణలు కేవలం హెచ్చరికలకే పరిమితమవుతున్నాయా..? లేక నివేదికలపై చర్యలు ఆలస్యమవుతున్నాయా..? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.కొద్దిరోజుల క్రితం ఖైరతాబాద్ జోన్ లో హెల్త్ విభాగానికి చెందిన ఓ అధికారి తన వ్యక్తిగత ఈఎంఐ చెల్లింపుల కోసం కింది స్థాయి సిబ్బందిపై తీవ్ర ఒత్తిడి తీసుకొచ్చారన్న ఆరోపణలు సంచలనం సృష్టించాయి. ఈ వ్యవహారంపై కమిషనర్ విజిలెన్స్ విచారణకు ఆదేశించగా... ఆరోపణలు నిజమేనని నివేదికలో తేలినట్లు తెలుస్తుంది. అయితే ఆ అధికారి మీద ఇప్పటివరకు ఎలాంటి విభాగపరమైన చర్యలు తీసుకోకపోవడం చర్చనీయాంశంగా మారింది. దీంతో విజిలెన్స్ నివేదికల ప్రాముఖ్యతపై ఉద్యోగుల్లోనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

స్పోర్ట్స్,ప్రాపర్టీ టాక్స్‌లోనూ..

జిహెచ్ఎంసీకి ప్రధాన ఆదాయ వనరైన ఆస్తి పన్ను విధింపు, వసూళ్లలో కూడా భారీ అసమానతలు బయటపడినట్లు తెలుస్తోంది. జీఐఎస్ సర్వేలో కమర్షియల్ భవనాలకు రెసిడెన్షియల్ పన్ను విధించడం, పెద్ద భవనాలకు తక్కువ విస్తీర్ణం చూపించి పన్ను తగ్గించడం, అనుమతులకు విరుద్ధంగా వినియోగిస్తున్న భవనాలపై సరైన పన్ను విధించకపోవడం వంటి అంశాలు వెలుగులోకి వచ్చాయి. ఈఅంశాలపై గతంలో విజిలెన్స్ విచారణ జరిగినప్పటికీ తాజాగా ఇంటెలిజెన్స్ విభాగం ద్వారా కూడా మరోసారి లోతైన పరిశీలన జరుగుతున్నట్లు తెలుస్తోంది. షాపింగ్ కాంప్లెక్స్‌లు, వాణిజ్య భవనాలు, అనుమతులు లేని నిర్మాణాలకు సంబంధించిన పన్ను విధింపులో చోటుచేసుకున్న అక్రమాలపై కూడా కమిషనర్ ప్రత్యేక దృష్టి సారించినట్లు సమాచారం. ఇదే సమయంలో స్పోర్ట్స్ విభాగంలో మెటీరియల్ కొనుగోళ్లు, సమ్మర్ కోచింగ్ కార్యక్రమాలకు సంబంధించిన టెండర్లలో సింగిల్ టెండర్‌కు ఆమోదం తెలిపిన వ్యవహారంపై కూడా ఆరోపణలు వచ్చాయి. ఈ వ్యవహారాలపై విజిలెన్స్ విచారణకు ఆదేశించారు.. అయితే విచారణల ఫలితాలు ఏమయ్యాయి..? బాధ్యులు ఎవరు..? చర్యలు ఎక్కడ..? అనే ప్రశ్నలకు మాత్రం ఇప్పటివరకు సమాధానం దొరకడం లేదు. మరోవైపు ఖైరతాబాద్ జోన్‌లోని ఓఅధికారి తాను కమిషనర్‌కు అత్యంత సన్నిహితుడినని, తనను ఎవరూ ఏమీ చేయలేరంటూ ప్రచారం చేసుకుంటున్నారన్న చర్చ కూడా ఉద్యోగుల్లో వినిపిస్తోంది. దీంతో ఈతరహా ప్రచారం సంస్థ ప్రతిష్టకు భంగం కలిగిస్తోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. విజిలెన్స్ విచారణలు పారదర్శకంగా జరిగి, నివేదికలు బహిర్గతం చేసి, ఆరోపణలు రుజువైతే కఠిన చర్యలు తీసుకోవాలన్న డిమాండ్ ఉద్యోగ సంఘాలు, ప్రజా వర్గాల నుంచి వినిపిస్తోంది.

విజిలెన్స్ విచారణలు జరుగుతున్నాయన్న వార్తలతో అధికారులు, సిబ్బంది తమ విధుల పట్ల మరింత అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారని అయితే విచారణల ఫలితాలు, వాటిపై తీసుకున్న చర్యలు ప్రజల ముందుకు రాకపోతే పారదర్శకతపై ప్రశ్నలు తలెత్తే అవకాశం ఉందని చర్చించుకుంటున్నారు. అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటేనే విజిలెన్స్ వ్యవస్థపై నమ్మకం మరింత పెరుగుతుందన్న అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

అర్హులైన ఓట్ల తొలగింపు కుట్రలు అడ్డుకోవాలి : కెటిఆర్

-బిఆర్ఎస్‌ను మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

అడ్డగుట్ట,జూన్ 3 ప్రభాతవార్త: ఓటర్ల జాబితా,ప్రత్యేక సవరణ (ఎస్ఐ.ఆర్.) పేరిట నిర్వహిస్తున్న సర్వేలో జరిగే ఓటర్ల తొలగింపు కుట్రలను అడ్డుకోవాలని, వాటిపై కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్,మాజీ మంత్రి కల్వకుంట్ల తారాకరామారావు (కేటీఆర్) పిలుపునిచ్చారు. బుధవారం సీతాఫల్ మండి మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన బూత్ లెవల్ డెలిగెట్స్ ప్రతినిధులు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. హైదరాబాద్ మహానగరాన్ని విచ్ఛిన్నం చేసే కుట్రలను అడ్డుకోవాలన్నారు. కార్యకర్తలు,నాయకులు ఐకమత్యంగా వ్యవహరించి ఓటర్లనజాబితా సవరణ, బిఆర్ఎస్ సభ్యత్వ నమోదు ప్రక్రియను విజయవంతం చేయాలన్నారు. ఎమ్మెల్యేలు టీ.పద్మారావు గౌడ్, తలసాని శ్రీనివాస్ యాదవ్, బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్‌లు మాట్లాడుతూ గ్రేటర్ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాలన్నీ తెలంగాణ వాదానికి కంచుకోటగా ఉన్నాయన్నారు. ఓటర్లను చైతన్యం చేసేందుకు కార్యకర్తలు చురుకుగా పనిచేయాలన్నారు. 10 యేండ్ల బిఆర్ఎస్ ప్రభుత్వంలో కనీ,వినీ ఎరుగని రీతిలో అభివృద్ధి జరిగిందన్నారు. 33 జిల్లాల్లో కలెక్టర్ కార్యాలయాలు, మెడికల్ కళాశాలలు,

సికింద్రాబాద్ అసెంబ్లీ బిఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ప్రసంగిస్తున్న వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, చిత్రంలో ఎమ్మెల్యేలు పద్మారావు గౌడ్,తలసాని శ్రీనివాస్ యాదవ్,ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్, మన్నెక్రిషాంక్ తదితరులు

సచివాలయం, 24 అడుగుల బారీ అంబేద్కర్ విగ్రహాన్ని నెలకోల్పడంతో పాటు తెలంగాణ తొలి ముఖ్య మంత్రి కేసిఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశంలోనే ఆదర్శంగా నిలిచాయన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. బిఆర్ఎస్ యువ నాయకుడు తీగుళ్ల రామేశ్వర్ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, కంటోన్మెంట్ ఇన్‌ఛార్జి మన్నెనక్రిషాంక్, సికింద్రాబాద్ పార్లమెంట్ ఇన్‌ఛార్జి తలసాని సాయికిరణ్ యాదవ్,మాజీ ఎమ్మెల్యే సలీమ్, మాజీ కార్పొరేటర్లు లింగాని ప్రసన్న శ్రీనివాస్,సామల హేమ, రాసూరి సునీత, కంది శైలజా, సమన్వయ కర్త రాజా సుందర్, ఎన్నికల ఇన్‌ఛార్జి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి సన్నద్ధతే.. రేపటి భద్రత

-వైపరీత్యాల నివారణకు ముందస్తు జాగ్రత్తలు అవసరం
-హైడ్రా కమిషనర్ రంగనాథ్

హైదరాబాద్, జూన్ 3,ప్రభాతవార్త: ఈరోజు సన్నద్ధత..రేపటి భద్రత అనేది హైడ్రా గట్టిగా నమ్మడమే కాదు.. ఆచరించి చూపుతోందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. వర్షాకాలం వరదల నియంత్రణతో పాటు..వేసవి కాలం నీటి ఎద్దడి నివారణకు చెరువులు ప్రధాన పాత్ర పోషిస్తాయని గుర్తించి వాటి పునరుద్ధరణకు పెద్దయెత్తున కృషి చేస్తున్నామన్నారు. విపత్తుల నివారణ, సాంకేతికత వినియోగం, ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు, వాతావరణ మార్పుల ప్రభావాలు, విపత్తు నిర్వహణలో వినూత్న ఆవిష్కరణలపై ఒడిశా రాష్ట్రంలోని పూరీ నగరంలో జూన్ 3వ తేదీ నుంచి 5 వరకు రెండవ బ్రిక్స్ డిజాస్టర్ రిస్క్ రిడక్షన్ సదస్సులో రంగనాథ్ మాట్లాడారు. జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ మూడు రోజుల సదస్సులో తెలంగాణ రాష్ట్రం తరఫున హాజరై హైడ్రా కార్యకలాపాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. నగరీకరణలో చెరువులు, సహజవనరులు పెద్దయెత్తున్న దెబ్బతింటున్నాయని వర్షం పడితే నీరు భూమిలోకి ఇంకడం మాట అటుంచితే.. ఆ నీరు ఎటు వెళ్లాలో తెలియని పరిస్థితులే నగరాల్లో వరదలకు కారణమన్నారు. చెరువులు, నాలాల పునరుద్ధరణను పెద్దయెత్తున చేపట్టిందని.. ఈ క్రమంలో ఇప్పటికే 6 చెరువులను పూర్తి చేశామని.. మరో 18 చెరువులను చేపట్టామన్నారు.చెరువుల సంరక్షణ ద్వారా నగరానికి సహజ వరద నియంత్రణ వ్యవస్థను పునరుద్ధరిస్తున్నామని తెలిపారు. నాలాల



పూరీలో జరిగిన సదస్సులో మాట్లాడుతున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

విస్తరణకు ముందు సికింద్రాబాద్ ప్యాట్నీ ఏరియా, అమీర్‌పేట, బాగ్‌లింగంపల్లిలోని శ్రీరాంనగర్ బస్తీలలో వరద నీరు ఎలా ముంచెత్తింది.. ఆ సమస్య పరిష్కారానికి హైడ్రా చేపట్టిన చర్యలు.. తర్వాత అక్కడ పరిస్థితులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వరా హైడ్రా కమిషనర్ వివరించారు. హైడ్రా ఏర్పాటై దాదాపు రెండేళ్ల సమయంలో చెరువులు, నాలాలు, పార్కులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలు, ప్రభుత్వ భూముల ఆక్రమణలు తొలగించి 2,182 ఎకరాలను కాపాడిన వివరాలు లెక్కలతో తెలిపారు. వీటి విలువ సుమారు 9.48 బిలియన్ అమెరికన్ డాలర్లు, అంటే దాదాపు రూ.80 వేల కోట్లకు పైగా ఉంటుందని వెల్లడించారు. హైడ్రా మాన్సూన్ ఎమర్జన్సీ టీమ్‌లతో పాటు డిజాస్టర్ రెస్పాన్స్ టీమ్‌లు క్షేత్రస్థాయిలో ఎలా పని చేస్తున్నాయో వీడియోల ద్వారా చూపించారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు

-అన్నిశాఖలు జవాబుదారీతనంతో పనిచేయాలి
-నగర సిపి సజ్జనార్

హైదరాబాద్,జూన్ 3,ప్రభాతవార్త: నగరంలో రోడ్డు ప్రమాదాలు, మరణాలను తగ్గించేందుకు చేపట్టాల్సిన చర్యలపై తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో బుధవారంఉన్నతస్థాయి రోడ్డు భద్రత సమీక్ష సమావేశం నిర్వహించారు. సిపి వి.సి. సజ్జనార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జాయింట్ సిపి (ట్రాఫిక్) జోయెల్ డేవిస్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలా పాల్గొన్నారు. ఈసందర్భంగా నగరంలోని రోడ్లు, జాతీయ రహదారుల వారీగా ప్రమాదాల గణాంకాలు, ప్రమాదాలకు గురయ్యే బ్లాక్ స్పాట్లు, బ్లైండ్ స్పాట్లు, పాదచారుల ప్రమాదాలు, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, హిట్ అండ్ రన్ ఘటనలు, బాధితులకు అందిస్తున్న పరిహారం తదితర అంశాలను సమగ్రంగా సమీక్షించారు. గత ప్రమాదాల ఆధారంగా ప్రమాదాలకు గురయ్యే ప్రాంతాలను గుర్తించి చేపట్టాల్సిన చర్యలపై పూర్తిస్థాయిలో చర్చించారు. ఈ సందర్భంగా సిపి సజ్జనార్ మాట్లాడుతూ రోడ్డు భద్రత విషయంలో సంబంధిత శాఖలన్నీ జవాబుదారీతనం, బాధ్యతతో పనిచేయాలని సూచించారు. సమీక్ష సమావేశాలు కేవలం చర్చలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో చర్యలు, ఫలితాలుగా మారాలని అన్నారు. నగరంలో తగిన రోడ్డు సూచికలు, రహదారి గుర్తులు, జీబ్రా క్రాసింగ్‌లు, ఫుట్‌పాత్‌ల ఏర్పాటుతో పాటు ఆక్రమణల తొలగింపు చేపటాలని సూచించారు. అక్రమ రహదారి దాటివేతలను నిరోధించేందుకు సెంట్రల్ మీడియన్లు, డివైడర్ల ఎత్తు పెంచి గార్డ్ రైలింగ్‌లు ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రమాదాల చరిత్ర ఆధారంగా గుర్తించిన ప్రాంతాల్లో ఫుట్ ఓవర్ బ్రిడ్జ్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా వీధి దీపాల ఏర్పాటు, స్పీడ్ కంట్రోల్ చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ వ్యవస్థల మెరుగుదల, శాస్త్రీయంగా యూటర్న్‌లు, ఫ్రీ లెఫ్ట్‌ల రూపకల్పన, ట్రాఫిక్ రద్దీ తగ్గింపు, లేన్ క్రమశిక్షణ అమలు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. జోయెల్ డేవిస్ మాట్లాడుతూ నగరంలోని ప్రధాన బ్లాక్ స్పాట్లు, బ్లైండ్ స్పాట్లు ప్రమాదాలకు గురయ్యే ప్రాంతాలపై ప్రజెంటేషన్ ఇచ్చారు. ఆయా ప్రాంతాల్లో ఫుట్ ఓవర్ బ్రిడ్జ్‌ల నిర్మాణం, బస్ షెల్టర్ల తొలగింపు లేదా స్థాన మార్పు, బస్ బేల నియంత్రణ తదితర చర్యలను ప్రతిపాదించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలా మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు, మరణాలను నివారించడం ప్రధాన లక్ష్యమని తెలిపారు. సంబంధిత శాఖలకు అప్పగించిన పనులపై నిర్దిష్ట గడువులోగా యాక్షన్ టేకెన్ రిపోర్టులు సమర్పించాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో ఆర్టీఏ సభ్యుడు నేతికార్ సురేష్ లాల్, అడిషనల్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ రమేష్, టీజీఎస్ఆర్టీసీ హైదరాబాద్ రీజినల్ మేనేజర్ సుధా పరిమళ, జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ), రోడ్లు భవనాల శాఖ, రవాణా శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీస్, స్వచ్ఛంద సంస్థలు మరియు ఇతర భాగస్వామ్య సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిపి సజ్జనార్, కలెక్టర్ ప్రియాంక ఆల, జోయెల్ డేవీస్

బ్రెడ్‌లో చనిపోయిన బల్లి

- షాక్‌కు గురైన కుటుంబ సభ్యులు
- కిరాణాషాపు యజమానిపై చర్యలు తీసుకోవాలంటున్న గ్రామస్థులు

నార్సింగి, జూన్ 3 ప్రభాతవార్త : అధికారుల అలసత్వం ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారుతోంది. ప్రజలు తినే ఆహార పదార్థాల నాణ్యతను తరచు పరీక్షించాల్సిన ఫుడ్‌సేఫ్టీ అధికారగణం మచ్చుకైనా కానరావడం లేదు. ఫలితంగా నాశీరకమైన ఆహార పదర్థాలు మార్కెట్‌లో హల్‌చల్ చేస్తున్నాయి. ఏడాదికి ఒకటి, రెండు సార్లు దాడులు చేస్తే పాచిపోయిన, కుళ్లిపోయిన మటన్, చికెన్, ఆహార పదార్థాలు పట్టుబడుతున్నాయి. నామమాత్రంగా రూ.5.వేల వరకు జరిమానాలు విధించి చేతులు దులుపు కుంటున్నారు. ఆ తరువాతా షరా'మామూలే' అన్న చందంగా మారింది ఫుట్‌సేఫ్టీ అధికారుల తీరు. తాజాగా బుధవారం నార్సింగి సర్కిల్ పరిధి జన్వాడ గ్రామంలోని ఓ కిరణాషాపులో అశోక్ అనే వ్యక్తి బ్రెడ్ పాకెట్ తీసుకెళ్లాడు. ఇంటికి వెళ్లి తన కుమారుడికి పాలల్లో వేసి తినిపిస్తుండగా చనిపోయిన బల్లి కనిపించింది. దీంతో షాక్‌కు గురైనా ఆ వ్యక్తి కిరణాషాపు యమానికి చూపించి ఆగ్రహం వ్యక్తం చేశారు. దీన్ని తిని నా బిడ్డ అనారోగ్యం పాలైనా, ప్రాణనష్టం జరిగినా ఎవరు బాధ్యత వహించే వారని నిలదీశారు. షాపు యజమాని స్పందిస్తూ డిస్టి బ్యూటర్‌ను పిలిపించి చూయిస్తానని, ఇందులో నా తప్పేమి లేదని సర్ది చెప్పాడు. విషయం తెలుసుకున్న స్థానికులు ఈ బ్రెడ్ ను సరఫరా చేసిన వారిపై, అమ్ముతున్న వారిపై చట్టపరంగా కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఫుడ్‌సేఫ్టీ అధికారులు తమ విధులను పట్టించుకోకపోవడం వల్లనే ఇలాంటి సంఘటనలు తరచూ చోటు చేసుకుంటున్నాయని జన్వాడ గ్రామ స్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పెద్దలు సైతం ఫుడ్‌సేఫ్టీ అధికారుల సంఖ్యను పెంచి, మార్కెటల్‌లో విక్రయిస్తున్న ఆహార పదార్థాలు, తినుబండారాల నాణ్యతను తరుచూ పరీక్షించేలా చర్యలు తీసుకోవాలని జన్వాడ గ్రామస్థులు డిమాండ్ చేశారు.

జన్వాడలో బ్రెడ్‌లో చనిపోయిన బల్లి వచ్చిన దృశ్యం

చాంద్రాయణగుట్టను పీడిస్తున్న కలుషిత నీరు,లోప్రెషర్

- ఎమ్మెల్యే, ఎండి ఆదేశాలు బేఖాతర్

చాంద్రాయణగుట్ట, జూన్ 3, ప్రభాతవార్త : దేవుడు వరమిచ్చినా పూజారు కరుణించలేదు... అన్న చందంగా తయ్యారైయ్యింది వాటర్‌వర్క్స్ పరిస్థితి. ప్రజల దాహార్తిని తీర్చాల్సిన జలమండలి అధికారులు ఉన్నతాధికారుల ఆదేశాలను, ప్రజా ప్రతినిధుల సిఫార్సులను ఏమాత్రం పట్టించుకోవటం లేదు. మంజూరైన పనులు కార్యరూపం దాల్చటం లేదు. పై ఆదేశాలా, లేక వారి నిర్లక్ష్యమో తెలియటం లేదు. నెలల తరబడిగా నాన్చుతున్నారు. ఫలితంగా అనేక బస్తీలను లోప్రెషర్, కలుషిత నీరు, కాలం చెల్లిన మంచినీటి పైప్‌ల సమస్య పీడిస్తుంది. అలియాబాద్ సబ్ డివిజన్ మైసారం సెక్షన్ పరిధిలో అధికారుల అలసత్వం కారణంగా చాంద్రాయణగుట్ట, కుమ్మరివాడి, హరిజనబస్తీ, నారాయణ్‌బాగ్, గాంధీ విగ్రహం పరిసర బస్తీల ప్రజలు మంచినీటికి కటకట పడుతున్నారు. రోజు విడిచి రోజు సరఫరా కావాల్సిన మంచినీరు ఎప్పుడు ఏ వేళకు వస్తుందో తెలియటం లేదు. సమయ పాలన లేకుండా సరఫరా చేస్తున్నారు. పైగా లోప్రెషర్‌తో కలుషిత నీరు వస్తుంది. కనీసం తాగటానికి, ఇంటి అవసరాలకు యోగ్యంగా లేకుండా ఉంటున్నాయి. నీటి సరఫరా జరిగే కొద్దిపాటి సమయంలో ఎక్కువ శాతం రంగు మారి, దుర్గంధంతో కూడిన కలుషిత నీళ్లు వస్తున్నాయి. ఆ నీటిని జనాలు ఇళ్ళలోని మోరీలలోకి మళ్లిస్తున్నారు. గత కొన్ని నెలలుగా స్థానిక ప్రజలు అధికారులుకు, స్థానిక లీడర్లకు మొర పెట్టుకుంటున్నా సమస్య పరిష్కారానికి నోచు కోవటం లేదు. ఆయా బస్తీల ప్రజలు కొన్ని నెలలుగా ఎదుర్కొంటున్న సమస్యను స్థానిక మజ్లిస్ పార్టీ సీనియర్ నేత కె.నాగరాజ్ చాంద్రాయణగుట్ట శాసనసభ్యులు అక్బరుద్దీన్ ఒవైసీ దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్‌రెడ్డికి తేది. 15-11-2025, తేది. 19-05-2026లలో లేఖ రాశారు. ఆయా బస్తీలలో కలుషిత నీరు, లోప్రెషర్, కాలం చెల్లిన పైప్‌లైన్ల మార్పు, కేశవగిరిపై గల ఆలయాల మంచినీటి సమస్యను పరిష్కరానికి అవసరమైన బూస్టర్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఎమ్మె ల్యే ఆదేశాల మేరకు రియాసతనగర్ డివిజన్-8 జనరల్ మేనేజర్ కె.భాస్కర్ 2025 డిసెంబర్ 28న రూ.21.89లక్షల రూపాయలతో (మొత్తం పనులు రూ.49.05లక్షలు) రాజేంద్రనగర్ జోన్ చీఫ్ జనరల్ మేనేజర్‌కు ప్రతిపాదనలు పంపించారు. మరోవైపు ఎమ్మెల్యే ఆదేశాల మేరకు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని జలమండలి ఎండి అశోక్‌రెడ్డి సంబంధిత అధికారులకు నేరుగా సూచించినా ఇంత వరకు పనులు ప్రారం భం కాలేదు. ఎందుకో మీనమేషాలు లెక్కిస్తున్నారు. ప్రజలు కలుషిత నీళ్లు తాగలేక, వేళాపాల లేకుండా సరఫరా అవుతున్న మంచినీటితో సతమతమవుతున్నారు. ఎండా కాలంలో గుక్కెడు మంచినీటి కోసం అష్టకష్టాలు పడ్డారు. పనులకు, ఉద్యోగాలకు వెళ్ళే వారి పరిస్థితి వర్ణనాతీతం. జలమండలి ఉన్నతాధికారులు సమస్య తీవ్రతను గుర్తించి వెంటనే స్పందించాల్సి ఉంది. రానున్నది వర్షాకాలం కావటంతో కలుషిత మంచి నీటి సమస్య మరింత పెరుగక ముందే సమస్యాత్మక బస్తీలలో యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

జలమండలి నల్లాల నుండి సరఫరా అవుతున్న కలుషిత నీరు

చంద్రలేఖ,ధనుష్ జోడీ ముందంజ

-రసవత్తరంగా మాన్‌సూన్ రెగట్టా పోటీలు

పోటీల్లో గెలుపొందిన చంద్రలేఖ -ధనుష్ జోడీ

హైదరాబాద్, జూన్ 3,ప్రభాతవార్త: మాన్‌సూన్ రెగట్టా జాతీయ ర్యాంకింగ్ సెయిలింగ్ చాంపియన్‌షిప్‌లో రెండోరోజు పోటీలు రసవత్తరంగా సాగాయి. బుధవారం భారీ ఈదురు గాలులు వీయడంతో పలువురు సెయిలర్ల బోట్లు నీటిలో తిరగబడ్డాయి.అయినా అండర్ 18 బోట్ క్లాస్ రేసుల్లో యువ క్రీడాకారులు అద్భుత వేగంతో దూసుకెళ్తూ హోరాహోరీగా తలపడ్డారు. ఇంటర్నేషనల్ 420 మిక్స్‌డ్ క్లాస్ విభాగంలో రసూల్‌పురా ఉద్భవ్ స్కూల్ కు చెందిన స్కిప్పర్ చంద్రలేఖ తట్టారి, వనపర్తి శామీర్‌పేట ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ఈఐఎస్ బాయ్స్ స్కూల్ విద్యార్థి ధనుష్ జక్కులతో కలిసి పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. ఈ జోడీ వరుసగా రెండు రేసుల్లో క్లాస్ విజయాలను నమోదు చేసి ప్రస్తుతం పట్టికలో అగ్రస్థానంలో కొనసాగుతోంది. నిరుడు బద్రీనాథ్ (రసూల్‌పురా) సుంచనకోటల రిశ్వింత (కామారెడ్డి బాలికల పాఠశాల) ద్వయం ద్వితీయ స్థానంలో నిలిచింది. కాగా, రేసులో టాప్ సీడ్ సెయిలర్ దీక్షిత కొమరవెల్లి బోటు తిరగబడటంతో ఆమె భుజానికి తీవ్ర గాయమైంది. దీంతో ఆమె టోర్నమెంట్ నుంచి రిటైర్ అయింది. స్కిఫ్ 29ఇఆర్ బోట్ క్లాస్ విభాగంలో వినోద్ దండు (రసూల్‌పురా) క్రూ అరవింద్ మాలోత్ (నిజామాబాద్ ఇందూర్ బాయ్స్ స్కూల్) జోడీ మూడు రేసుల్లో రెండు గెలిచి పట్టికలో ముందంజలో ఉంది. ముంబైలో జరిగిన ఆసియా క్రీడల ట్రయల్స్‌లో విజేతలుగా నిలిచిన నేవీ యూత్ సెయిలింగ్ కంపెనీ (ఎన్‌వైఎస్‌సీ) టాప్ సీడ్స్ శరణ్య జాదవ్ శివం జోడీని వెనక్కి నెట్టి వినోద్ బృందం పైచేయి సాధించడం విశేషం. ఇక, లేజర్ (ఐఎల్‌సీఏ4) అండర్18 బాయ్స్ పోటీల్లో నేవీకి చెందిన ప్రీత్ సివాల్, హృదయ్ జోషి పూర్తి ఆధిపత్యం ప్రదర్శించి తొలి రెండు స్థానాల్లో నిలిచారు. లేజర్ అండర్18 బాలికల్లో నేవీకి చెందిన కాత్యాయని కౌశిక్ తన అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. అండర్15 ఆప్టిమిస్ట్ క్లాస్‌లో సికింద్రాబాద్ క్లబ్‌కు చెందిన శృంగేరి రాయ్ రెండో రేసులో విజయం సాధించింది.

పచ్చదనం పెంచేందుకు కట్టుదిట్టమైన చర్యలు

- మల్కాజిగిరి కార్పొరేషన్ కమిషనర్ వినయ్ క్రిష్ణా రెడ్డి

పార్కును పరిశీలిస్తున్న కమిషనర్

అల్వాల్, జూన్ 3 ప్రభాతవార్త: నగరంలో పచ్చదనం పెంచడంతో పాటు ఇంటింటి నుంచి చెత్త సేకరణను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని మల్కాజిగిరి కార్పొరేషన్ కమీషనర్ వినయ్ క్రిష్ణా రెడ్డి పేర్కొన్నారు. బుధవారం అల్వాల్ పట్టణ పరిధిలో అధికార యంత్రాంగంతో కలిసి విస్తృతంగా పర్యటించారు. ఓల్డ్ అల్వాల్ రోడ్డు, కందాడి ఎన్‌క్లేవ్, సరస్వతి కాలనీ, మచ్చబొల్లారం, విజయ్ విహార్ ఎన్‌క్లేవ్, రైల్వే ఎంప్లాయిస్ కాలనీ తదితర ప్రాంతాలులోని అభివృద్ధి పనులు పరిశీలించడంతో పాటుగా సమస్యలను తెలుసుకున్నారు. ఓల్డ్‌అల్వాల్ ఇందిరాగాంధీ విగ్రహం చౌరస్తాను కమీషనర్ పరిశీలించారు. పారిశుధ్య కార్మికులుతో మాట్లాడిన ఆయన యంత్ర పరికరాలు పని తీరును సమీక్షించారు. పట్టణాన్ని శుభ్రంగా ఉంచడంలో కార్మికులు పాత్ర కీలకమని ఆయన తెలిపారు. కందాడి ఎన్‌క్లేవ్, సరస్వతి కాలనీ పరిసరాలులోని వరద నీటి కాలువ పూడిక తీతను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. వర్షా కాలాన్ని దృష్టిలో ఉంచుకుని నాలాలులో అడ్డంకులు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు రోడ్లపై చెత్త వేయకుండ

ఘనంగా శ్రీమత్ సుందరకాండ సప్తాహ్నిక యజ్ఞం

వివేకనగర్ ఆంజనేయస్వామి దేవాలయంలో సుందరకాండ హోమం నిర్వహించిన దృశ్యం

చిక్కడపల్లి, జూన్ 3 ప్రభాతవార్త :
చిక్కడపల్లి వివేకనగర్ ఆంజనేయస్వామి దేవాలయంలో శ్రీమత్ సుందరకాండ సప్తాహ్నిక యజ్ఞములో భాగంగా బుధవారం శాస్త్రోక్తంగా సుందరకాండ హోమం నిర్వహించారు. ఆలయం పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ జానకి సుధాకర్, మాచర్ల దేవనాథం, దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమంలో భాగంగా అవాహిత దేవతామంటపారాధన, శ్రీమత్ సుందరకాండ హోమం, ప్రదోషకాల పూజ, నవగ్రహ హోమం, ఆరగింపు, మంగళహారతి, మంత్రపుష్పం, రాజోపచార చతుర్వేద అవధారలు ఆలయ అర్చకులు బుగ్గ లక్ష్మీపతి శర్మ, కందాళ వేంకటాద్రి నేతృత్వంలో శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాద వితరణ జరిగింది.

ప్లాస్టిక్ వాడకాన్ని నివారిద్దాం: మురళీమోహన్ రాజు

కార్యక్రమంలో పాల్గొన్న పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కె.మురళీమోహన్ రాజు తదితరులు

చిక్కడపల్లి జూన్ 3 (ప్రభాతవార్త):
ప్లాస్టిక్ పెనుభూతాన్ని సమిష్టి కృషితో పెకళించాలని పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కె.మురళీమోహన్ రాజు పేర్కొన్నారు. బుధవారం గాంధీనగర్ లోని బి.సి.ప్రజా చైతన్య సమాఖ్య భవన సముదాయంలో పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ వాడకాన్ని నివారిద్దాం అనే అంశంపై కవిసమ్మేళనం జరిగింది. ఈసందర్భంగా ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా మురళీమోహన్ రాజు రాజు పాల్గొని మాట్లాడుతూ దేశాన్ని పట్టి పీడిస్తున్న సమస్యల్లో ప్లాస్టిక్ అనేది మనకు కనిపించని పెనుభూతం లాంటిది. ప్లాస్టిక్ వాడకాన్ని నివారించకపోతే భవిష్యత్తు తరాలకు తప్పు చేసిన వారిగా మిగిలిపోతామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రముఖ కవి జింకా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం అనేది మానవ జీవితంలో ఒక భాగంగా మారడం ఎంతో బాధాకరం. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని సాధ్యమైనంత వరకు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి, పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని కోరారు. ఈకార్యక్రమంలో కవులు డి.కె.చదువుల బాబు, పల్లా వెంకట రామారావు, కాశీవరపు వెంకట సుబ్బయ్య, కంభం పామిలేటి, రచయితలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల, కళాశాలల అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే నవీన్ యాదవ్

బోరబండ సైట్3లోని తెలంగాణ గురుకుల రెసిడెన్సియల్ స్కూల్ జూనియర్ కళాశాలను సందర్శించిన ఎమ్మెల్యే నవీన్ యాదవ్.

యూసుఫ్‌గూడ, 3 జూన్, ప్రభాతవార్త :
ప్రభుత్వ కళాశాలల్లో చదివే విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాల కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం తగిన విధంగా కృషి చేయటం జరుగుతుంని జూబ్లీహిల్స్ శాసనసభ్యులు నవీన్ యాదవ్ అన్నారు. బుధవారం బోరబండ సైట్3లోని తెలంగాణ గురుకుల రెసిడెన్సియల్ స్కూల్ జూనియర్ కళాశాల విద్యా సంస్థలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల, కళాశాల ప్రాంగణాలను పరిశీలించి విద్యార్థులకు విద్యా సదుపాయాలు, మౌలిక వసతులు, అభివృద్ధి కార్యక్రమాలను సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించే దిశగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం అయ్యేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ జి.రమనణమ్మతో పాటు అధ్యాపకులు, సిబ్బంది, స్థానిక కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

జనసేనలో చేరిన డాక్టర్ గడల శ్రీనివాసరావు

జూబ్లీహిల్స్, జూన్ 3, ప్రభాతవార్త:
తెలంగాణ పబ్లిక్ అండ్ హెల్త్ ఫ్యామిలీ వెల్ఫేర్ మాజీ డైరక్టర్, డాక్టర్ గడల శ్రీనివాసరావు జనసేన అధినేత, ఏపి డిసిఎం పవన్‌కళ్యాణ్ ఆధ్వర్యంలో జనసేన పార్టీలో చేరారు. జూబ్లీహిల్స్‌లోని నివాసంలో పవన్ కళ్యాణ్ ఆయనకు పార్టీ కండువ కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ గడల శ్రీనివాసరావు కుటుంబంతో తమకు ఎంతో కాలంగా సన్నిహిత అనుబంధం ఉందన్నారు. ప్రజాసేవ పట్ల అంకితభావం, నిజాయితీ, పరిపాలన దక్షత కలిగిన అధికారిగా ఆయన ప్రజల్లో గౌరవం సంపాదించుకున్నారన్నారు. డాక్టర్ గడల శ్రీనివాసరావు మాట్లాడుతూ పవన్‌కళ్యాణ్ నిబద్ధత, నిజాయితీ తనను జనసేన వైపు నడిపించాయన్నారు. విలువలతో కూడిన రాజకీయాలు అవసరమని, అందుకే తాను ఈ మార్గాన్ని ఎంచుకున్నానన్నారు.

సెయింట్ మేరీస్ కళాశాలలో ప్లాటినం వేడుకలు

సికింద్రాబాద్ సెయింట్ మేరీస్ కళాశాలలో బహుమతులు ప్రధానం చేస్తున్న దృశ్యం

కంటోన్మెంట్,జూన్ 3 ప్రభాతవార్త: పర్యావరణ పరిరక్షణ,సుస్థిర అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని ప్రిన్సిపాల్ ప్రవీణ్ తెలిపారు. సస్టైనబుల్ క్యాంపస్ ఇంపాక్ట్ సమ్మిట్ అండ్ అవార్డు 2026 బుధవారం సికింద్రాబాద్ సెయింట్ మేరీస్ ఎంబిఏ కళాశాలోలో ప్లాటీనం అవార్డు వేడుకల్లో అయన పాల్గొన్నారు. ఈ సదస్సులో పాల్గొన్న విద్యార్థులకు ప్లాటీనం అవార్డు,ప్రశంస పత్రాలను అందజేశారు.

కేంద్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న లక్షలాది ఉద్యోగాలను భర్తీ చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న రోషన్‌కుమార్ సిన్హా

సైఫాబాద్, జూన్3 ప్రభాతవార్త: యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా పోరాటాలు ఉధృతం చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) జాతీయ అధ్యక్షుడు రోషన్‌కుమార్ సిన్హా పిలుపునిచ్చారు. బుధవారం హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్‌లో జరిగిన ఎఐవైఎఫ్ రాష్ట్ర సమితి సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశంలో యువత ఎదుర్కొంటున్న నిరుద్యోగం, విద్యా సంక్షోభం, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ , కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఖ్య పెరుగుదల, పెరుగుతున్న ఫీజులు, సామాజిక అసమానతలు వంటి అంశాలపై ఈ సమావేశంలో చర్చించడం జరిగిందన్నారు. మోదీ ప్రతి ఏడాది రెండు కోట్లు ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి యువతను మోసం చేశారని, పదేళ్ళకు పైగా అధికారంలో ఉన్నప్పటికి నిరుద్యోగ సమస్య మరింతగా తీవ్రమైందన్నారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీగా ఉన్న లక్షలాది ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేయరాదని డిమాండ్ చేశారు. వీటిపైన యువత విస్తృతంగా ప్రచారం చేసి ఉద్యమాలను చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వలిఉల్లాఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర, కార్యనిర్వాహక అధ్యక్షుడు నెర్లకంటి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్‌కు అదనంగా డబ్బులు వసూలు చేస్తున్న బంకులపై చర్యలు తీసుకోవాలి

మహేష్‌కుమార్‌గౌడ్, వివేక్ వెంకటస్వామికి వినతి పత్రాలను అందజేస్తున్న రుద్రాక్ష మల్లేష్

సైఫాబాద్, జూన్ 3 ప్రభాతవార్త: రాష్ట్రంలోని ప్రైవేటు పంపుల్లో ఒక కిలో గ్యాస్‌కు అదనంగా 24 రూపాయలు వసూలు చేస్తున్న బంకులపై రాష్ట్ర ప్రభుత ్వం చర్యలు తీసుకోవాలని అఖిల భారత అసంఘటిత కార్మిక, ఉద్యోగుల కాంగ్రెస్ (కెకెసి) తెలంగాణ ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ విభాగం కార్యదర్శి రుద్రాక్ష మల్లేష్ కోరారు. ఈ మేరకు బుధవారం టిపిసిసి అధ్యక్షుడు బి.మహేష్ కుమార్‌గౌడ్, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామికి ఆయన వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడుతూ ప్రభుత్వ బంకుల్లో కిలో గ్యాస్‌కు చట్ట ప్రకారంగా తీసుకుంటుంటే, ప్రైవేటు పెట్రోల్ బంకుల్లో కిలో గ్యాస్‌కు 24 రూపాయలకు అదనంగా వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఫుల్ ట్యాంక్‌కు మరో 100 రూపాయలు అదనంగా వసూలు చేస్తున్నారని, తక్షణమే కిలో గ్యాస్‌పై 24 రూపాయల అక్రమంగా వసూలు చేస్తున్న బంకులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆదే విధంగా హైదరాబాద్ నగరంలో 3 లక్షలకు పైగా ఆటో డ్రైవర్లు ఆటోలపై జీవనం సాగిస్తున్నారని, ప్రభుత్వం తీసుకువచ్చిన మహాలక్ష్మి ఉచిత బస్ ప్రయాణంతో ఆటో డ్రైవర్లకు బాడుగులు లేక అల్లాడిపోతున్నారని, ఆనేక మంది ఆర్థిక ఇబ్బందులు ఎదురొ ్కంటున్నారని, కొంత మంది ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో మీటర్ చార్జీలు మినిమం 50 రూపాయలకు, 1 కిలోమీటర్‌కు అదనంగా 20 రూపాయలకు పెంచాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కే.శరత్‌కుమార్, మహమ్మద్ ఫరూక్, సత్యనారాయణగౌడ్, నాగరాజ్, బాలకోఠి, విప్లవ్‌కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అక్రిడేషన్‌తో సంబంధం లేకుండా జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

సమావేశంలో ప్రసంగిస్తున్న సొసైటీ అధ్యక్షుడు మామిడి సోమయ్య

చిక్కడపల్లి జూన్ 3 (ప్రభాతవార్త): సుప్రీంకోర్టు తీర్పుతో సంబంధం లేకుండా, వర్కింగ్ జర్నలిస్ట్స్ యాక్ట్ ప్రకారం అన్ని కేటగిరీల్లోని జర్నలిస్టులకు ప్రభుత్వం వెంటనే ఇళ్ల స్థలాలు కేటాయించాలని గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ హౌసింగ్ సొసైటీ సర్వసభ్య సమావేశం డిమాండ్ చేసింది. బుధవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభ లో సొసైటీ అధ్యక్షుడు మామిడి సోమయ్య అధ్యక్షతన జరిగింది.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు కావస్తున్నా.. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల అంశంపై ఎలాంటి పురోగతి లేకపోవడం విచారకరమని సీనియర్ జర్నలిస్టులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో జర్నలిస్టుల ఇళ్ల స్థలాలు, సుప్రీంకోర్టు తీర్పు, ప్రభుత్వ వైఖరి తదితర అంశాలపై చర్చించి పలు కీలక తీర్మానాలు చేశారు.ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నైశిదం సత్యనారాయణ మూర్తి, తెలంగాణ జనసమితి గ్రేటర్ బీసీ సెల్ అధ్యక్షుడు జశ్వంత్, సీనియర్ జర్నలిస్టులు తీగవరపు శాంతి, నాగవాణి, సొసైటీ కోశాధికారి తన్నీరు శ్రీనివాస్, డైరెక్టర్లు యర్రమిల్లి రామారావు, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

పోలీసు ఆరోగ్యానికి 'రెండు కోతలు'!

- ఆరోగ్య భద్రత, ఈహెచ్ఎస్ పేరుతో కటింగ్‌లు

జూబ్లీహిల్స్, జూన్ 3, ప్రభాతవార్త:
పోలీసుల ఆరోగ్య సంరక్షణ కోసం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఇప్పుడు పోలీసుల పాలిట భారంగా మారుతుంది. ఆరోగ్య భద్రత పేరుతో జీతంలో కోత పెట్టిన ప్రభుత్వం ఇప్పుడు ఈహెచ్ఎస్(ఎంప్లాయిస్ హెల్త్ స్కీం) పేరుతో మరో కోత పెడుతుంది. ఫలితంగా ఆరోగ్యానికి సంబంధించి పోలీసులకు ప్రతి నెల ఇప్పుడు రెండు కోతలు పడుతున్నాయి. పోలీసుల ఆరోగ్య భద్రత కోసం పోలీసు శాఖ చాలా ఏళ్ల క్రితం ఆరోగ్య భద్రత పేరుతో పథకాన్ని తీసుకొచ్చింది. తద్వారా పోలీసు జీతంలో కోతలు విధించి ఆరోగ్య భద్రత కల్పించింది. ఆయా పోలీసు తోపాటు వారి కుటుంబ సభ్యులకు, వారిపై ఆధారపడే తల్లిదండ్రులకు ఈ అవకాశాన్ని కల్పించింది. ప్రభుత్వ ఆసుపత్రులతోపాటు, కొన్ని ఒప్పందం కుదుర్చుకున్న ప్రైవేటు ఆసుపత్రులలో ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే అనారోగ్యం బారిన పడినా, శస్త్ర చికిత్సలు అవసరమైనా పోలీసులు ఈ పథకాన్ని వినియోగించుకొనేవారు. ఆసుపత్రిలో చికిత్సల నేపథ్యంలో దాదాపు 80 నుంచి 100 శాతం వరకు ఆసుపత్రులలో చెల్లింపులు జరిగేవి. బిల్లుల చెల్లింపు విషయంలో ప్రభుత్వం వైపు నుంచి జరిగే ఆలస్యం నేపథ్యంలో కొన్ని సందర్భాలలో ప్రైవేటు ఆసుపత్రులు చికిత్సను సైతం అనుమతించని సందర్భాలు ఉన్నాయి. కాగా తాజాగా ప్రభుత్వం పోలీసులకు ఎంప్లాయిస్ హెల్త్ స్కీమం వర్తింపజేయాలని భావించి అమలు చేసింది. ఈ క్రమంలోనే పోలీసు అధికారి జీతంలోని బేసిక్ అలవెన్స్‌లో 1.5 శాతం ఈహెచ్ఎస్‌కు వర్తింపజేస్తూ అధికారి జీతంలో కోత విధిస్తుంది. ఈ నెల నుంచి ఈహెచ్ఎస్‌ను వర్తింపజేయడంతో పోలీసుల జీతంలో ఒకవైపు ఆరోగ్య భద్రత పేరుతో మరోవైపు ఈహెచ్ఎస్ పేరుతో రెండు కత్తిరింపులు జరుగుతున్నాయి. రెండింటికి డబ్బులు వసూలు చేస్తున్న ప్రభుత్వం ఏ పథకం ఎందుకు ఉపయోగపడుతుందనే విషయాన్ని స్పష్టం చేయాల్సిన అవసరం ఉందని పోలీసులు భావిస్తున్నారు. లేదంటే ఏదైనా ఒక పథకాన్ని అమలు చేసి మరో పథకానికి కత్తిరిస్తున్న డబ్బులను నిలిపివేయాలని కోరుతున్నారు. అంతేకాకుండా ఆరోగ్యభద్రత ఫండ్ పేరుతో ప్రతి నెల ఉద్యోగి నుంచి వేల రూపయాల్లో డబ్బులు కత్తిరిస్తుంది. 20 పైసల సాధారణ వడ్డీతో సదరు ఉద్యోగి తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. అయమితే ఎవరైనా ఉద్యోగి డబ్బులు అవసరమని భావించి రుణానికి దరఖాస్తు చేసుకుంటే నెలలు దాటుతున్నా ఆయా డబ్బులు అర్జీదారుడి ఖాతాలోకి చేరడం లేదు. దాదాపు మూడేళ్లుగా అర్జీలు పెట్టుకున్నవారి ఖాతాల్లోకి చాలా అరుదుగా ఈ రుణాలు వచ్చి చేరాయి. కోతల పేరుతో కత్తిరిస్తున్న డబ్బులు పోలీసులకు ఉపయోగపడేలా సత్వర చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఫోర్జరీ పత్రాలతో ఇన్యూరెన్స్ క్లెయిమ్ ..నిందితుల అరెస్ట్

అఫ్జల్‌గంజ్,జూన్ 3ప్రభాతవార్త: మరణించిన వ్యక్తుల డేటాను దుర్వినియోగం చేస్తూ,ఇన్సూరెన్స్ క్లెయిమ్ మోసానికి పాల్పడిన నిందితులను సుల్తాన్‌బజార్ పోలీసు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సుల్తాన్‌బజార్ ఇన్‌స్పెక్టర్ జి. నరేష్ కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండలం,గ్రామానికి చెందిన మాజీ ఉద్యోగి బోడకృష్ణ(47) ,అదే ప్రాంతానికి చెందిన స్టార్ హెల్త్ ఏజెంట్‌గా పనిచేస్తున్న మాల్దే మహేష్ (44), నగరంలోని అల్మాస్‌గూడ రోడ్ నెంబర్ 5,శ్రీహోమ్స్‌లో నివసించేమడసిరవార వంశీకృష్ణ(30),స్టార్ హెల్త్ సంస్థలో సెల్స్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. కాగానిరాశ్రయుడైన తలారి వెంకటయ్య పేపర్లు,ఏరుకుని, ఇనుము అమ్మే దుకాణంలో విక్రయించి,వచ్చినడబ్బుతో భార్యతోనన కలిసి జీవనం సాగిస్తున్నారు.ఈక్రమంలో హెల్త్ ఏ జెంట్ మహేష్,స్టార్ హెల్త్ సేల్స్ మేనేజర్, బోడకృష్ణలు,ముగ్గురరు కలిసి నకిలీ పత్రాలతో ఇన్యూరెన్స్ క్లెయిమ్ పొందడానికి పథకం,రచించారు.తలారి వెంకటయ్య పేరిట 2024 డిసెంబర్ 27న వ్యక్తి గత ప్రమాద భీమా పాలసీ జారీ చేయబడింది.అందులో బోడ శ్రీకృష్ణను నామినిగా పేర్కొన్నడంతో పాటు కుటుంబ సభ్యులంతా మరణిం చారని,సంబంధిత వివరాలన్నీ తన ద్వారానే జరపాలని పట్టుబడంతో అనుమానం వచ్చినఇన్యూరెన్స్ అధికారులు స్టార్ హెల్త్ అండ్ అలైడ్ ఇన్సూరెన్స్ సంస్థ సికింద్రాబాద్‌లో చీఫ్ విజిలెన్స్ అధికారిగా పని చేస్తున్న రిటైర్డ్ ఎస్సీ మొహ మ్మద్ అబ్దుల్‌బారీకి అంతర్గత విచారణ భాద్యతలు అప్పగిం చారు. నామిని, ఏజెంట్‌తో కలిసి ఎఫ్ఐఆర్,ఇంక్వెస్ట్ రిపోర్టు, పోస్టుమార్టంతో పాటు ఇతపత్రాలను ఫోర్జరీచేసి, మరణ తేదిని 2025 ఏప్రిల్28గా చూపించి భీమాక్లెయిమ్ నిజమైనదిగా చూపించేందుకుగాప్రయత్నించినట్లు తెలిపారు. అసలు రికార్డుల ప్రకారం..తలారి వెంకటయ్య పేపర్లువేరుకుంటూ 2023,జనవరి9వ తేదిన చాదర్‌ఘాట్ గణేష్‌టెంపుల్ వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ షాక్ తగిలి అపస్మా రస్థితిలో మరణించినట్లు,శ్రీకృష్ణ తాను మృత్యుడికి బావ మరిదిని అని,తప్పుడు సమాచారం ఇచ్చిమృత్యుడి కుటుంబ సభ్యులంతా మరణించినట్లు తెలిపారు.కంపెనీతే సంబంధిత సమాచారం మొత్తం తన ద్వారానే జరపాలని పట్టుబట్టినట్లు విచారణలో వెల్లడి అయ్యిందని తెలిపారు.విజిలెన్స్ అధికారినివేధిక మేరకు ఇన్సూరెన్స్ సంస్థ సుల్తాన్‌బజార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఈ మేరకుసుల్తాన్‌బజార్ పోలీసులు కేసు నమోదు చేసుకుని పోర్జరీ పత్రాలతో ఇన్యూరెన్స్ కంపెనీకే టోకరావేసేందుకు ప్రయత్నించిన బోడ శ్రీకృష్ణ, మాల్దేమహేష్,మడసిరవార వంశీకృష్ణలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సి.ఐ నరేష్ తెలిపారు.

ప్రజలకు మరింత చేరువలో ఎంఎంసీ వెటర్నరీ విభాగం

హైదరాబాద్, జూన్ 3,ప్రభాతవార్త:
మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కుక్కల బెడద, పశువుల సంబంధిత ఫిర్యాదులు, కోతుల బెడద, మృత జంతువుల తొలగింపు తదితర సమస్యలపై ప్రజలకు సత్వర సేవలు అందించేందుకు జోన్‌లు, సర్కిళ్ల వారీగా వెటర్నరీ అధికారుల సంప్రదింపు వివరాలను ఎంఎంసీ వెటర్నరీ విభాగం విడుదల చేసింది. ప్రజలు తమ ప్రాంతాల్లో ఎదురయ్యే వెటర్నరీ సంబంధిత సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చి త్వరితగతిన పరిష్కారం పొందవచ్చని వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మల్కాజిగిరి జోన్ పరిధిలోని కీసర, ఆల్వాల్, బోయిన్‌పల్లి, మౌలాలి, మల్కాజ్‌గిరి సర్కిళ్లకు చెందిన ప్రజలు డా. టి. సంజయ్ 9247540129 ను, ఉప్పల్ జోన్ పరిధిలోని ఘట్‌కేసర్, కాప్రా, నాచారం, బోడుప్పల్ వాసులు డా. కె. శ్రీనివాస్ రావు 8712034408 ను, ఉప్పల్ ప్రాంత వాసులు డా. పి. ప్రసన్న - 8712499203 నెంబర్ కు సంప్రదించవచ్చునని తెలిపారు. అలాగే ఎల్బీ నగర్ జోన్ పరిధిలోని నాగోల్, హయత్‌నగర్ వాసులు డా. పి. శ్యామ్ సుందర్ 9063421353, సరూర్‌నగర్, ఎల్‌బీ నగర్ వాసులు డా. డి. బీక్యా 9063836131 నెంబర్ కు సంప్రదించవచ్చునన్నారు. ప్రజలు తమ ప్రాంతాల్లోని వెటర్నరీ సంబంధిత సమస్యలను సకాలంలో తెలియజేసి మున్సిపల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఎంసీ కమిషనర్ వినయ్ క్రిష్ణా రెడ్డి కోరారు.

కవితాగానంలో వెల్లివిరిసిన తెలంగాణ ప్రజాకళ

సన్మానగ్రహీతలైన కవులతో నరసింహారెడ్డి, విజయ్‌కుమార్, ముచ్చర్ల తదితర అతిథులు

రవీంద్రభారతి, జూన్ 3 ప్రభాతవార్త :
తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో సంచాలకుడు డా. ఏనుగు నరసింహారెడ్డి పర్యవేక్షణలో రవీంద్రభారతి ప్రాంగణంలోని పాల్కురికి సోమన్న (ఘంటసాల) ఆరుబయలు కళామందిరంలో తెలంగాణ ప్రజాకళ శీర్షికన 99 రోజుల సాంస్కృతిక మహోత్సవం 63వ రోజు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని నిర్వహించిన కవిసమ్మేళనంలో పలువురు ప్రముఖ కవుల అద్భుత కవితాగానంతో తెలంగాణ ప్రాశస్త్యం వెల్లివిరిసింది. రాయారావు సూర్యప్రకాష్‌రావు నిర్వహణలో జరిగిన ఈ కవిసమ్మేళనంలో కవులు వెన్నెల సత్యం, అంకం మనోహర్, సరికొండ నరసింహరాజు, కాసుల లింగారెడ్డి, కాంచనపల్లి రాజేందర్ రాజు, లిఖిత్‌కుమార్ గోదా, ఇంద్రావత్ రాహుల్‌నాయక్, మహ్మద్ హస్పేన, కటుకోజ్వల రమేష్, పొన్నం రాజయ్య, పాటి మోహన్‌రెడ్డి, సిహెచ్.ఆంజనేయులు, ముదిగొండ సంతోష్, నాగవర్మ ముత్యం, నాగిళ్ళ రమేష్, సుంకర రమేష్, వి.పి.చందన్‌రావు. వేణుశ్రీ సుదర్శనం, సురారం శంకర్, నర్రా ప్రవీణ్‌రెడ్డి, బూర్గు గోపీకృష్ణ, సందీప్ ఒటారికారి, అనుముల ప్రభాకరాచారి, వడిచెర్ల సత్యం, స్వప్న కొండమడుగు వారి వారి కవితలతో ఆలోచింపజేసి ఎంతగానో ఆకట్టుకున్నారు. కవిసమ్మేళనానికి ముందు తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు విద్యానందచారి, బాలుప్రసాద్, అమూల్య, స్పందన, బందంరాజు తదితరులు పలు తెలంగాణ ఆవిర్భావ గీతాలతో చైతన్యపరిచి ఉర్రూతలూగించారు. విద్యానందచారి వ్యాఖ్యానం సందర్భోచితంగా అలరించింది. చివరిగా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సంచాలకుడు డా. ఏనుగు నరసింహారెడ్డి కవులను ఘనంగా సన్మానించారు.

ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తీరుస్తాం : మాజీ కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్

పనులను పరిశీలిస్తున్న వెంకటేష్ గౌడ్

కెపిహెచ్‌బి కాలనీ, జూన్ 2, ప్రభాతవార్త
ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఉషముళ్ళపూడి ప్రధాన రహదారిలో ఎల్లమ్మ చెరువు మహంకాళి నగర్ పెట్రోల్ బంక్ వద్ద మ్యాన్ హోల్స్ నుండి వరద నీరు పొంగి రోడ్డు మీద ప్రవహించడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ మంగళవారం రాత్రి బుధవారం రోజు కూడా జల మండలి ఉన్నతధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ నీటి పారుదల, రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో డ్రైనేజీ పైప్ లైన్ ధ్వంసమై సమస్య మొదలైందని, గత వారం రోజుల నుండి ప్రజల ఇబ్బందులను గుర్తించి పలుమార్లు సందర్శించి, నివారణ చర్యలు చేపట్టడం జరిగిందని అన్నారు. సమస్యను పరిష్కరించడానికి శేరిలింగంపల్లి శాసన సభ్యులు పి.ఎ.సి చైర్మన్ అరేకపూడి గాంధీతో, అధికారులతో మాట్లాడి మరమ్మత్తు పనులు చేస్తున్నామని తెలియచేసారు. అధికారులతో కలిసి అక్కడే ఉండి ఎల్లమ్మ చెరువు వద్ద నీటి పారుదల పైప్ లైన్ నిర్మాణ పనులలో భాగంగా గతంలో తవ్విన గుంతలో జమైన నీటిని మోటార్ సహాయంతో తొలగించి సమస్యను పరిష్కరించామని తెలియచేసారు. వాటర్ పైప్ లైన్ నిర్మాణ పనులు, రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు సమన్మయంతో కలిసికట్టుగా పనిచేసి ప్రజలకు ఇబ్బందులు ఎదురవ్వకుండా చూడాలని అన్నారు. ఉషముళ్ళపూడి కమాన్ నుండి గాజులరామరం వరకు వయా ఎల్లమ్మ బండ ప్రధాన రహదారి 100 ఫీట్ రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నందున కొన్ని ఇబ్బందులు కూడా ఎదురవ్వుతున్నాయని వాటిని ప్రజలు అర్థం చేసుకుని నిర్మాణ పనులు పూర్తయ్యేవరకు ఓపికతో ఉండాలని, రోడ్డు విస్తరణ జరిగితే మన ఎల్లమ్మబండ ప్రధాన రహదారి ట్రాఫిక్ కష్టాలు తొలగి ప్రయాణం సాఫిగా సాగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో జల మండలి సైబరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంతోష్ రెడ్డి, డైరెక్టర్ నారాయణ, కూకట్‌పల్లి జోన్ జీఎం హరి శంకర్, డిజిఎం శ్రీనివాస్ రాజు.నాయకులు పాండు గౌడ్, పోశెట్టి గౌడ్, జిల్లా గణేష్, కాశినాథ్ యాదవ్, మరెళ్ల శ్రీనివాస్, షౌకత్ అలీ మున్నా, గుడ్ల శ్రీనివాస్, అంజయ్య యాదవ్, ఖలీమ్, మహేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

మేరు ఆత్మ గౌరవ భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలి

రూ.4.5లక్షలతో ఎస్‌డబ్ల్యూజీ పనులు ప్రారంభం

పూలబండలో ఎస్‌డబ్ల్యూజీ పనులను ప్రారంభిస్తున్న బిజెపి ఉపాధ్యక్షులు పొన్న వెంకటరమణ

చాంద్రాయణగుట్ట, జూన్ 3, ప్రభాతవార్త : హరిబౌలి డివిజన్, లాల్‌దర్వాజా పూలబండలో సుమారు రూ.4.5లక్షలతో చేపట్టిన ఎస్‌డబ్ల్యూజీ పైప్‌లైన్ పనులను భారతీయ జనతా పార్టీ భాగ్య నగర్ జిల్లా ఉపాధ్యక్షులు పొన్న వెంకటరమణ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా హనుమాన్ దేవాలయం ప్రాంతంలో వర్షాకాలంలో డ్రైనేజీ నీరు పొంగి పొర్లుతూ స్థానిక ప్రజలు, భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురైయ్యారన్నారు. బస్తీవాసుల వినతి మేరకు విషయాన్ని జీహెచ్ఎంసి అధికారుల దృష్టికి తీసుకువెళ్ళి తగిన నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మహేష్, తులసి, సాకేత్ తదితరులు పాల్గొన్నారు.

19న బంగారు మైసమ్మ వార్షికోత్సవం

చాంద్రాయణగుట్ట, జూన్ 3, ప్రభాతవార్త : పాతబస్తీ చాంద్రాయణ గుట్ట చౌరస్తాలోని శ్రీ బంగారు మైసమ్మ దేవాలయం 25వ వార్షిక మహోత్సవం, నాగప్రతిష్ఠన కార్యక్రమాన్ని ఈనెల 19వ తేదీ శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆ ఆలయ అధ్యక్షులు ఎన్. నర్సింగ్‌రావు తెలిపారు. ఉదయం 6గంటలకు అమ్మవారికి పంచామృతాభిషేకం, 10.05 గంటలకు నాగ ప్రతిష్ఠాపన, 11.30 గంటలకు దుర్గా సహిత సర్పసూక్త హోమం, పూర్ణాహుతి, మధ్యాహ్నం 12.30 గంటలకు మహా నైవేద్యం, హారతి, అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు. పూజా కార్యక్రమాలలో భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని పేర్కొన్నారు.

అర్హులైన వారికి సంక్షేమ పథకాలు

పెన్షన్లు పొందుతున్న వారి వివరాలను సేకరించిన రెవెన్యూ అధికారులతో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు పి.చంద్రమోహన్‌యాదవ్

గన్‌ఫౌండ్రి,జూన్ 3 ప్రభాతవార్త: ప్రజా సంక్షేమ పథకాలను పొందేందుకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకున్న వారికి, పెన్షన్లు పొందుతున్న వారు తిరిగి రెన్యూవెల్ చేసుకోవాలని ఖైరతాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు పి.చంద్రమోహన్ యాదవ్ అన్నారు. గన్‌ఫౌండ్రి,జాంబాగ్ డివిజన్ల పరుధులోని తదితర బస్తీలో పెన్షన్లు పొందుతున్న వారు రెన్యూవెల్ చేసుకున్నారు. వృద్దులు, వికలాంగులు,ఒంటరి మహిళలు జీవించి ఉన్నారా లేక మృతి చెందరా అనే విషయాన్ని నిర్ధారించుకునే క్రమంలో ప్రభుత్వం అందిస్తున్న పెన్షర్ల వివరాలను సేకరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ పి.చంద్రమోహన్ మాట్లాడుతూ పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్న కొత్త వారికి ప్రభుత్వం స్పందించి పెన్షన్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో నాంపల్లి మండల విఆర్ఓ శేఖర్,కాంగ్రెస్ నాయకులు చేతన్,జయశంకర్, సలీం, అశోక్‌యాదవ్,శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను బలోపేతం చేస్తాం

బేగంబజార్,జూన్ 3ప్రభాతవార్త: కాంగ్రెస్ పార్టీ బేగంబజార్ డివిజన్ నూతన అధ్యక్షులుగా తొట రాకేష్‌యాదవ్ నూతనంగా నియమితులయ్యారు.ఈమేరకు టి.పి.సి.సి అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్ ఆదేశాలమేరకు ఖైరతాబాద్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మోతా రోహిత్‌ను బేగంబజార్ డివిజన్ అధ్యక్షులుగా నియమిస్తున్నట్లు ఉత్తర్వుజారీ చేశారు.ఈసందర్భంగా నూతన బేగంబజార్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులుతోట రాకేష్‌యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో గత 15 సంవత్సరాలుగా విద్యార్థి విభాగం, యువజన విభాగం ప్రధాన కార్యదర్శిగా పార్టీ కోసం పనిచేసినట్లు చెప్పారు.తనపై నమ్మకం ఉంచి బేగంబజార్‌డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నియమించిన టి.పి.సి.సి అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్,కార్యనిర్వాహక అధ్యక్షులు ఎం.అంజన్‌కుమార్ యాదవ్, మోహిత రోహిత్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.బేగంబజార్ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకువస్తానన్నారు.

ఉజ్జయినీ మహాకాళీ హుండీ ఆదాయం రూ.17,92,792లు

శ్రీఉజ్జయినీ మహాకాళీ ఆలయంలో హుండీ లెక్కిస్తున్న దృశ్యం.

బేగంపేట జూన్ 3,ప్రభాతవార్త

సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ దేవస్థానంలో బుధవారం హుండీ లెక్కింపు జరిగింది.62రోజులకు సంబంధించిన హుండీలను లెక్కించారు.దేవాదాయ శాఖ ఇన్స్‌పెక్టర్ శ్రీదేవి,ఆలయ కార్య నిర్వహణాధికారి జి.మనోహర్ రెడ్డి ,ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ సురిటి రామేశ్వర్,సురిటి కామేశ్వర్,మాజీ ధర్మకర్తలు,భక్తుల సమక్షంలో హుండీలను విప్పి లెక్కింపు నిర్వహించారు.ఇందులో నోట్లు రూ 16,53,595లు,కాయిన్స్ రూ 1,39,197లు మొత్తం రూ 17,92,792లు మొత్తం మిశ్రమ బంగారం 016గ్రా050మి.గ్రాములు.మిశ్రమ వెండి 450గ్రా300మి.గ్రాములు ఇతర దేశాలకు సంబంధించిన 95డాలర్లు కానుకల రూపంలో వచ్చినట్లు ఈఓ గుత్తా మనోహర్ రెడ్డి తెలియజేసారు.

ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు చెల్లించాలి

కంటోన్మెంట్,జూన్ 3 ప్రభాతవార్త: ఆర్టీసీలో పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను తక్షణమే చెల్లించాలని కోరుతూ టీజీ.ఎస్.ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధులు బుధవారం బస్ భవన్‌లో ఆర్టీసి మేనేజింగ్ డైరెక్టర్ నాగిరెడ్డిని కలిసి వనతిపత్రం అందజేసినట్లు రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం.కిషోకుమార్,కోశాధికారి కె.దుర్గలు తెలిపారు. ఈ సందర్భంగా వారు విలేకర్లతో మాట్లాడుతూ 2017, 2021 పే స్కేల్ డిఫరెన్స్‌అమౌంట్ ఇవ్వాలని, లీవ్ ఎన్ క్యాస్మెంట్,డీఏ బ్యాలెన్స్‌అమౌంట్ ఇవ్వాలని వినతిపత్రం సమర్పించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఎంప్లాయిస్ ప్రతినిధులు కె.స్వామి, కె.ఎస్.నారాయణ, శ్రీనివాస్,రాఘవరావ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత అన్నదాన కార్యక్రమం గొప్ప సామాజిక సేవ : ఎమ్మెల్యే తలసాని

సంజీవరెడ్డి నగర్, జూన్ 3, ప్రభాతవార్త: మన సంపాదనలో కొంత భాగాన్ని సమాజ సేవకు, పేదల ఆకలి తీర్చడానికి వినియోగించినప్పుడు కలిగే ఆత్మసంతృప్తికి మించినది మరొకటి లేదని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు.సనత్‌నగర్‌లోని బీకే గూడ పార్క్ వద్ద శ్రీనివాస సమాజ సేవ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మార్చి 20న ప్రారంభమైన ఉచిత మధ్యాహ్న అన్నదాన కార్యక్రమం బుధవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ మనిషి జనం, మరణం సహజమైనవేనని, అయితే సమాజంలోని పేదలకు చేసే సేవలు మాత్రం చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు.రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి, సీనియర్ సిటిజన్ కౌన్సిల్ మాజీ అధ్యక్షుడు పార్థసారథి ఆధ్వర్యంలోని శ్రీనివాస సమాజ సేవ చారిటబుల్ ట్రస్ట్ ప్రతి సంవత్సరం వేసవి కాలంలో సుమారు రెండున్నర నెలల పాటు వేలాది మంది పేదల ఆకలి తీర్చడం అభినందనీయమని కొనియాడారు. వయసును సైతం లెక్కచేయకుండా సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ ఆదర్శంగా నిలుస్తున్నారని ప్రశంసించారు.దేశానికి స్వాతంత్రం వచ్చిన దశాబ్దాలు గడిచినా ఇంకా అనేక మంది ఆకలితో బాధపడుతున్నారని పేర్కొన్న ఆయన, పేదల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వాలు మరింత సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ సందర్భంగా ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు పంపిణీ చేయడానికి సిద్ధం చేసిన 160 నోట్‌బుక్స్‌ను ట్రస్ట్ చైర్మన్ పార్థసారథి ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు అందజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, సనత్‌నగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు కొలన్ బాల్ రెడ్డి, ట్రస్ట్ సభ్యులు రామమూర్తి, సత్యనారాయణ, కృష్ణారెడ్డి, విఠల్ రెడ్డి, సీనియర్ సిటిజన్ కౌన్సిల్ అధ్యక్షుడు దూబే, సభ్యులు సహదేవ్ గౌడ్, శంకర్, ప్రసాద్, విజయలక్ష్మి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని

కరెంటు సమస్యలను సత్వరమే పరిష్కరించాలి : రేఖ యాదగిరి

-నాణ్యమైన విద్యుత్ సరఫరాకు రేయింబవళ్లూ కష్టపడుతున్నాం : ఏఈ

నార్సింగి, జూన్ 3 ప్రభాతవార్త : ప్రజలు ఎదుర్కొంటున్న కరెంటు సమస్యలను సత్వరమే పరిష్కరించాలని నార్సింగి మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ దారుగుపల్లి రేఖ యాదగిరి పేర్కొన్నారు. బుధవారం నార్సింగి సర్కిల్ పరిధిలోని వట్టినాగులపల్లి వివేకానందనగర్ కాలనీలో రూ.15.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన 160.కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏఈ మణికంఠతో కలిసి రేఖ యాదగిరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కరెంటు కష్టాలు దూరం చేసేందుకు శ్రమిస్తున్న విద్యుత్ శాఖ అధికారులకు, సిబ్బందికి మేమందరం పూర్తి సహకారం అందజేస్తామని తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న కరెంటు కష్టాలను వేగంగా పరిష్కరించాలని సూచించారు. అనంతరం ఏఈ మణికంఠ మాట్లాడుతూ కరెంటు కష్టాలను శాశ్వతంగా పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్‌లిమిటెడ్ నిధులు మంజూరు చేస్తుందని తెలిపారు. అన్ని గ్రామాలు, కాలనీలలో అవసరమైన నూతన విద్యుత్ స్థంభాలు, కేబుల్ వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తామని, రెండు రోజుల్లో పూర్తి వివరాలు సేకరించి ఎస్టిమేట్లు సిద్ధం చేస్తామని స్పష్టం చేశారు. కరెంటు సమస్యలన్నింటిని దూరం చేసి, ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు రేయింబవళ్లూ కష్టపడుతున్నామని ఏఈ మణికంఠ వివరించారు. ఏ ప్రాంతంలో కరెంటు ఇబ్బందులు తలెత్తినా వెంటనే నా దృష్టికి తీసుకురావాలని, వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఏఈ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు మల్లేష్ యాదవ్, బిఆర్ఎస్ నాయకులు సంతోష్, కాలనీ ప్రతినిధులు తిరుపతయ్య, కొండలరెడ్డి, వేణు, చుక్కయ్య, శ్రీనాథ్, జై, లైన్‌మెన్ లక్పతి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వివేకానందనగర్ కాలనీలో నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న మాజీ చైర్ పర్సన్ రేఖ యాదగిరి, ఏఈ మణికంఠ తదితరులు.

జ్యోతిరావు పూలే విగ్రహం-నాగులూరు రహదారి మరమ్మతులకు వినతి

దుండిగల్, జూన్ 3, ప్రభాతవార్త

జ్యోతిరావు పూలే విగ్రహం నుంచి నాగులూరు వరకు ఉన్న రహదారి అధ్వాన్నంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే మరమ్మతు పనులు చేపట్టాలని కోరుతూ దుండిగల్ మాజీ సర్పంచ్ కావలి గణేష్ బుధవారం సంబంధిత అధికారులకు వినతిపత్రం అందజేశారు.దుండిగల్ సర్కిల్ ఇంజినీరింగ్ సెక్షన్ డీఈఈ పప్పమ్మను కలిసి రహదారి సమస్యలను వివరించిన గణేష్, ఈ మార్గంలో ప్రతిరోజూ వందలాది మంది ప్రయాణిస్తున్నారని తెలిపారు. రోడ్డు దెబ్బతినడంతో వాహనదారులు, పాదచారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రజల భద్రత, రవాణా సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని అత్యవసర ప్రాతిపదికన రహదారి మరమ్మతు పనులు చేపట్టాలని ఆయన అధికారులను కోరారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో మెరుగైన రహదారులు కీలక పాత్ర పోషిస్తాయని, ప్రజా అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని సూచించారు.ఈ సందర్భంగా ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు సానుకూలంగా స్పందించి తగిన చర్యలు చేపట్టాలని గణేష్ విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో దొంతి మహేష్ ముదిరాజ్, పండుగ శివ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న కావలి గణేష్

సీనియర్ జర్నలిస్టు యాదగిరికి తెలంగాణ అవార్డు

చాంద్రాయణగుట్ట, జూన్ 3, ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్ పాతనగరం ప్రజా వేదిక, ఇయ్యాల తెలంగాణ డిజిటల్ మీడియా సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాతబస్తీలో ఉత్తమ సేవలందిస్తున్న ప్రముఖులకు అవార్డులు ప్రదానం చేశారు. సీనియర్ జర్నలిస్టు వరకాల యాదగిరిని అవార్డు, శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా వేదిక, మీడియా ప్రతినిధులు మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం జరిగిన ఉద్యమంలో సీనియర్ జర్నలిస్టు యాదగిరి క్రియాశీలక భూమిక పోషించారన్నారు. ప్రజా యుద్ధనౌక గద్దర్ లాంటి పోరాట యోధులతో సమావేశాలు నిర్వహించి పాతనగర ప్రజలను తెలంగాణ ఉద్యమం వైపు నడిపించారన్నారు. విభిన్న రంగాలలో అతడు చేస్తున్న సేవలను గుర్తించి తెలంగాణ రాష్ట్ర అవిర్భావ దినోత్సవ అవార్డుతో సత్కరించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత గడ్డం సత్యనారాయణ, మజ్లిస్ పార్టీ నేత పులికంటి నరేష్, ఇయ్యాల తెలంగాణ డిజిటల్ మీడియా సంస్థ అధినేత భుజేందర్, పులికంటి రాధాకృష్ణ, బొజ్జ రియామ్స్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణ్ నాయక్ కుటుంబాన్ని ఆదుకోవాలి

మాజీ కౌన్సిలర్ శంకర్ నాయక్

ఆర్థిక సహాయం అంద జేస్తున్న శంకర్ నాయక్

దుండిగల్, జూన్ 3, ప్రభాతవార్త

తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న గాగిల్లాపూర్ తండాకు చెందిన కాట్రోత్ లక్ష్మణ్ నాయక్ కుటుంబాన్ని మానవతా దృక్పథంతో ఆదుకోవాలని దుండిగల్ మాజీ కౌన్సిలర్ శంకర్ నాయక్ పిలుపునిచ్చారు.గాగిల్లాపూర్ తండాకు చెందిన లక్ష్మణ్ నాయక్ దినసరి కూలీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో వైద్య పరీక్షలు చేయించుకోగా, ఆయన రెండు కిడ్నీలు, కాలేయం (లివర్) తీవ్రంగా దెబ్బతిన్నట్లు వైద్యులు నిర్ధారించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.ఈ విషయం తెలుసుకున్న మాజీ కౌన్సిలర్ శంకర్ నాయక్ లక్ష్మణ్ నాయక్‌ను, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి తన వంతు సహాయంగా రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. చిన్న ఇంట్లో నివసిస్తూ అనేక కష్టాలు పడుతున్న ఈ కుటుంబానికి సమాజంలోని దాతలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులు ముందుకు వచ్చి సహాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.అలాగే ఈ సమస్యను ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే కేపీ వివేకానంద, మాజీ మున్సిపల్ చైర్మన్ శంభీపూర్ కృష్ణ దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వ పరంగా సహాయం అందేలా కృషి చేస్తానని శంకర్ నాయక్ తెలిపారు.లక్ష్మణ్ నాయక్ త్వరగా కోలుకుని సాధారణ జీవితంలోకి రావాలని స్థానికులు ఆకాంక్షి స్తున్నారు.

బిజెపి మహిళా నాయకురాలు సంధ్యాలక్ష్మికి పరామర్శ

సరోజ లక్ష్మిని పరామర్శించిన మర్రి పురురవారెడ్డి.

బేగంపేట జూన్ 3,ప్రభాతవార్త

సనత్‌నగర్ నియోజకవర్గం బేగంపేట డివిజన్ బీజేపీ మహిళా నాయకురాలు సంధ్యాలక్ష్మి తల్లి సరోజ మరణించిన విషయం తెల్సుకున్న బీజేపీ యువ నాయకుడు మర్రి పురురవారెడ్డి స్థానిక బీజేపీ శ్రేణులతో కల్సి వెళ్లి సంధ్యాలక్ష్మి కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ సందర్భంగా సరోజమ్మకు నివాళులు అర్పించారు.ఆమె ఆత్మకు శాంతి కలగాలని కోరుకున్నారు.వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసారు.బీజేపీ కార్యకర్తలకు పార్టీ ఎల్ల వేళలా అండగా ఉంటుందని మర్రి భరోసా నిచ్చారు.మర్రి వెంట బీజేపీ నాయకులు,కార్యకర్తలు ఉన్నారు.

వేముల వెంకటేష్ సేవలను వడ్డెర సమాజం ఎన్నటికీ మరచిపోదు : గుంజ శ్రీనివాస్



వేముల వెంకటేష్ చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

నిజాంపేట్, జూన్ 3, ప్రభాతవార్త

వేముల వెంకటేష్ చేసిన సేవలను వడ్డెర సమాజం ఎన్నటికీ మరచిపోదని, ఆయన ఆలోచనలు, ఆశయాలు ప్రతి కార్యకర్తలో సజీవంగా ఉన్నాయని గుంజ శ్రీనివాస్ అన్నారు. బుధవారం జాతీయ వడ్డెర సంఘం జాతీయ అధ్యక్షులుగా సేవలందించిన దివంగత వేముల వెంకటేష్ తొలి వర్ధంతి సందర్భంగా సంఘ నాయకులు, సభ్యులు ఘనంగా నివాళులర్పించారు. సమాజ అభ్యున్నతి కోసం వెంకటేష్ చేసిన కృషిని గుర్తు చేసుకుంటూ ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి గుంజ శ్రీనివాస్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కుంచపు రమ, రాష్ట్ర కార్మిక విభాగ అధ్యక్షుడు గోపాల్, గ్రేటర్ అధ్యక్షుడు గిరి బాబు తదితరులు పాల్గొని వేముల వెంకటేష్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జాతీయ వడ్డెర సంఘం ప్రస్తుత జాతీయ అధ్యక్షుడు పీట్ల శ్రీధర్, రాష్ట్ర అధ్యక్షుడు వల్లెప్ శివకుమార్ అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం నాయకులు, సభ్యులకు స్వాగతం పలికి సన్మానం చేశారు. వేముల వెంకటేష్ తొలి వర్ధంతి సభను విజయవంతంగా నిర్వ హించిన జాతీయ వడ్డెర సంఘం నాయకులు, సభ్యులకు గుంజ శ్రీనివాస్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో వడ్డెర సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమంలో ఐటీ రంగం కీలక పాత్ర : ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్

హైదరాబాద్, జూన్ 3,ప్రభాతవార్త: తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి, గౌరవించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీకి ఉద్యమంలో పాల్గొన్న ఐటీ ఉద్యోగులు, నిపుణులు, పారిశ్రామిక వేత్తల వివరాలతో సమగ్ర నివేదిక అందించాలని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ కోరారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ (టిటా) ఆధ్వర్యంలో హెచ్ఐసీసీ, నోవోటెల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో దయాకర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన దయాకర్, తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ఐటీ ఉద్యోగులు, సాఫ్ట్‌వేర్ నిపుణులు, ఐటీ రంగ ప్రతినిధుల పాత్ర విలువైనదని కొనియాడారు. వారి వివరాలను సేకరించి ప్రభుత్వ కమిటీకి సమగ్ర నివేదిక అందించాలని టిటా వ్యవస్థాపక అధ్యక్షుడు సందీప్ కుమార్ మక్తాలకు విజ్ఞప్తి చేశారు. అనంతరం సందీప్ కుమార్ మక్తాలా మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఐటీ ఉద్యోగులు, పారిశ్రామికవేత్తలు, విద్యార్థులు, సాంకేతిక రంగ ప్రతినిధులు ముందుకు వచ్చి తమ వివరాలు మరియు సంబంధిత ఆధారాలను సమర్పించాలని కోరారు. ఈ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు టిటా త్వరలోనే ఒక స్క్రీనింగ్ సెలెక్షన్ కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కమిటీ ధరఖాస్తులను స్వీకరించి, పరిశీలించి, అర్హులైన వారి వివరాలను సంకలనం చేసి ప్రభుత్వ కమిటీకి అందజేస్తుందని చెప్పారు. దరఖాస్తుల సమర్పణ విధానం, అవసరమైన పత్రాలు మరియు గడువు తేదీలను త్వరలో ప్రకటిస్తామని వెల్లడించారు. తెలంగాణ ఉద్యమంలో తమ భాగస్వామ్యాన్ని నిరూపించే పత్రికా కథనాలు, ఫోటోలు, వీడియోలు, ప్రశంసా పత్రాలు, వినతిపత్రాలు, సోషల్ మీడియా రికార్డులు తదితర ఆధారాలను సిద్ధంగా ఉంచుకోవాలని ఆయన సూచించారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ఐటీ రంగం చేసిన సేవలను సమగ్రంగా నమోదు చేసి, ప్రభుత్వ నియమిత కమిటీ దృష్టికి తీసుకెళ్లడం ద్వారా తగిన గుర్తింపు లభించేలా చేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని టిటా పేర్కొంది.

సమావేశంలో మాట్లాడుతున్న అద్దంకి దయాకర్, టిటా ప్రెసిడెంట్ సందీప్‌కుమార్ తదితరులు

మధురానగర్ ఠాణా ముందు యువతి ఆత్మహత్యాయత్నం

జూబ్లీహిల్స్, జూన్ 3, ప్రభాతవార్త: మధురానగర్ ఠాణా ముందు ఒక యువతి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఇది గమనించిన మధురానగర్ పోలీసులు యువతిని వెంటనే అదుపులోకి తీసుకొన్నారు. వివరాల్లోకి వెళితే.. తన సోదరుడితో ఉన్న వివాదం నేపథ్యంలో యువతి మధురానగర్ ఠాణాలో ఫిర్యాదు చేసింది. అయితే పోలీసులు తన ఫిర్యాదును పట్టించుకోవడం లేదని ఠాణా ముందుకు వచ్చిన యువతి పెట్రోల్ మీద పోసుకొని ఆత్మహత్యకు యత్నించింది. అది గమనించిన పోలీసులు వెంటనే ఆమెను అదుపులోకి తీసుకొని రక్షించారు. యువతి గతంలోనూ ఇదే తరహాలో పోలీసులను ఇబ్బందికి గురిచేసినట్లు తెలిసింది.

క్రీడాకారులు అంతర్జాతీయ పోటీల్లో రాణించాలి : ఎమ్మెల్యే శ్రీగణేష్

అడ్డగుట్ట,జూన్ 3 ప్రభాతవార్త: చిన్నారులు వేసవి శిక్షణా శిబిరాలను సద్వినియోగం చేసుకొని భవిష్యత్తులో గొప్ప క్రీడాకారులుగా ఎదగాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. మల్కాజిగిరి మున్సిపల్ జోన్ ఆధ్వర్యంలో బుధవారం మారేడ్‌పల్లి షెనాయ్ గ్రౌండ్‌లో నిర్వహించిన సమ్మర్ కోచింగ్ ముగింపు వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కంటోన్మెంట్ ప్రాంతం నుంచే జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా ఎదిగారన్నారు. అదే స్ఫూర్తితో వివిధ క్రీడల్లో ప్రతిభకనబర్చిన క్రీడాకారులు ఎదగాలన్నారు. సమ్మర్ క్యాంప్‌లో పాల్గొన్న క్రీడా విజేతలకు ఎమ్మెల్యే శ్రీగణేష్ చేతుల మీదుగా బహుమతులు, మెడల్స్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్, డిప్యూటీ కమిషనర్ డాకూ నాయక్, స్పోర్ట్స్ ఇన్‌స్పెక్టర్ గాయిత్రి తదితరులు పాల్గొన్నారు.

మారేడ్‌పల్లి షెనాయ్ గ్రౌండ్‌లో సమ్మర్ కోచింగ్ ముగింపు వేడుకల్లో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్

రికవరీ చేసిన మొబైల్ ఫోన్లు బాధితులకు అందజేత

కార్వాన్ జూన్3,ప్రభాతవార్త

టోలిచౌకి డివిజన్ ఏసిపి సయ్యద్ ఫయాజ్ పర్యవేక్షణలో టోలిచౌకి పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ సమయాల్లో దొంగతనానికి గురైన ఐదు లక్షల విలువైన 26 మొబైల్ ఫోన్లను పోలీసులు రికవరీ చేసి ఫోన్లను వాటి అసలు యజమానులకు అధికారికంగా అప్పగించారు.ఈ సందర్భంగా టోలిచౌకి డివిజన్ ఏసీపీ మాట్లాడుతూ..బాధితులు తమ ఫోన్లు పోగొట్టుకున్నప్పుడు సి.ఇ.ఐ.ఆర్ పోర్టల్‌లో నమోదు చేసిన వివరాల ఆధారంగా టోలిచౌకి క్రైమ్ టీమ్ సాంకేతిక దర్యాప్తును వేగవంతం చేసి కేంద్ర ప్రభుత్వ పోర్టల్ సి.ఇ.ఐ.ఆర్ ఉపయోగించి బీహార్,రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, తమిళనాడు, ఛత్తీస్‌గఢ్, చెన్నై, కర్ణాటక,ఆంధ్రప్రదేశ్,మహారాష్ట్రలలో రికవరీ చేసినట్టు పేర్కొన్నారు.ప్రజలు ఎవరైనా తమ మొబైల్ ఫోన్లను పోగొట్టుకుంటే లేదా దొంగతనానికి గురైతే,ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్‌లో ఫిర్యా

మాజీ మంత్రి హరీష్‌రావుతో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి బేటి

మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావును సత్కరిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

ఉప్పల్, జూన్ 3 ప్రభాతవార్త : మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావుతో బుధవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి బేటి అయ్యారు. ఈ సందర్భంగా హరీష్‌రావును కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణలో తిరిగి బిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఉప్పల్ నియోజకవర్గం పరిధిలో అభివృద్ధి పనులకు తగు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్, పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

పిసిసి ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శిగా తుమ్మల సందీప్

పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ నుంచి నియామక పత్రం అందుకుంటున్న తుమ్మల సందీప్ భూషణ్ తదితరులు

ఉప్పల్, జూన్ 3 ప్రభాతవార్త : పిసిసి ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శిగా ఉప్పల్‌కు చెందిన తుమ్మల సందీప్ భూషణ్ నియమితులైయ్యారు. ఈ మేరకు బుధవారం పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, ఎస్సీ సెల్ చైర్మన్ చైర్మన్ డా.కవ్వంపల్లి సత్యనారాయణ నుంచి నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా సందీప్ భూషణ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతోనే పేదలకు తగు న్యాయం జరుగుతుందని, ఉప్పల్ నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు తగు చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఎస్సీల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ తోడ్పాటు అందిస్తుందని, సంఘటితంగా ఉండి తమ సమస్యలు సాధించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు నేతలు సందీప్‌ను అభినందించారు. తనకు పదవి వచ్చేందుకు కృషి చేసిన నేతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నేతలు పాల్గొన్నారు.

హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన ఎస్జీఎస్‌గా అపర్ణ

చైర్మన్ చెకోలేకర్ లక్ష్మీ ని మర్యాదపూర్వకంగా కలిసిన నూతన ఎస్జీఎస్ అపర్ణ,చిత్రంలో వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్, గ్రేడ్ 1 కార్యదర్శి చిలకా నరసింహారెడ్డి, టి పిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి చెకోలేకర్ శ్రీనివాస్ తదితరులు

మలక్ పేట, జూన్ 3, ప్రభాతవార్త:

హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన ఎస్జీఎస్‌గా అపర్ణ మలక్ పేట మహబూబ్ మాన్షన్ మార్కెట్ కార్యాలయంలో పదవి బాధ్యతలు చేపట్టారు. నూతన ఎస్జీఎస్ గా పదవి బాధ్యతలు చేపట్టిన అపర్ణ హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చేకోలేకర్ లక్ష్మి, వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్, డైరెక్టర్లను మర్యాదపూర్వకంగా కలిసి సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఎస్జిఎస్ అపర్ణ మాట్లాడుతూ పాలక వర్గం సహకారం తో హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని మార్కెట్లను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సంక్షేమం కోసం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రేడ్ 1 కార్యదర్శి చిలకా నరసింహారెడ్డి, టి పిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి చెకోలేకర్ శ్రీనివాస్, డైరెక్టర్లు కిషన్ సింగ్, నేలపాటి రామారావు, పాశం అశోక్ గౌడ్, మహమ్మద్ షకీల్, బుద్ధ సత్యనారాయణ, రాజేందర్ రెడ్డి, గ్రేడ్ 3 కార్యదర్శి పుష్పలత, సిబ్బంది మాధురి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయం అభివృద్ధికి కృషి: చైర్మన్ బాబు శ్రీనివాస్

భక్తులకు చీరలను పంపిణీ చేస్తున్న దేవాలయం చైర్మన్ బాబు శ్రీనివాస్, వైస్ చైర్మన్ చౌకి రవికుమార్ తదితరులు

మలక్ పేట, జూన్ 3, ప్రభాతవార్త:

శ్రీ పోచమ్మ దేవాలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామని దేవాలయం కమిటీ చైర్మన్ బాబు శ్రీనివాస్ వైస్ చైర్మన్ చౌకి రవికుమార్ లు పేర్కొన్నారు. మలక్ పేట లోని శ్రీ పోచమ్మ దేవాలయంలో జరిగిన కార్యక్రమంలో భక్తులకు వారు చీరలను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 7వ తేదీ ఆదివారం దేవాలయంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసచారి, ప్రసన్న లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి : రాఘవేందర్‌రెడ్డి

అల్మాస్‌గూడ వినాయకహిల్స్ కాలనీలో బడంగ్‌పేట్ సర్కిల్ డిఇ తో కలిసి డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి

సరూర్‌నగర్, జూన్ 3 ప్రభాతవార్త: జిహెచ్ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్ నాదర్‌గుల్ డివిజన్ కిందకు వచ్చే అల్మాస్‌గూడ వినాయకహిల్స్ కాలనీలో దీర్ఘ కాలంగా ఉన్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తున్నామని కాంగ్రెస్ నాయకుడు, ఏఐసిసి విచార్ విభాగ్ కో-ఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. కాలనీలో ఏరులైన పారుతున్న డ్రైనేజీ సమస్యను బుధవారం ఆయన సర్కిల్ డిఇ అభినవ్‌తో కలిసి పరిశీలించారు. అయితే సమస్య తీవ్రత గురించి రాఘవేందర్‌రెడ్డి డిఇకి వివరించారు. ఈ నేపథ్యంలో స్పందించిన డిఇ డ్రైనేజీ మరమ్మతు పనులు ప్రారంభిస్తామని హామీనిచ్చారు. అనంతరం రాఘవేందర్‌రెడ్డి కాలనీవాసులతో మాట్లాడుతూ స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎదుళ్ల ప్రతాప్‌రెడ్డి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

పేదల కోసం పాటుపడే వారికి గుర్తింపు : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

రామంతాపూర్‌లో విద్యార్థులకు బ్యాగ్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, యూత్ నేత లావంగు నవీన్ తదితరులు

చిలుకానగర్‌లో రక్తదాన శిబిరంలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, పిట్టల నరేష్ తదితరులు

రామంతాపూర్, జూన్ 3 ప్రభాతవార్త : పేదల కోసం పాటుపడే వారికి తగు గుర్తింపు ఉంటుందని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఉప్పల్ సర్కిల్ పరిధిలోని రామంతాపూర్, చిలుకానగర్‌లో మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు జన్మదినం సందర్భంగా బిఆర్ఎస్ యూత్ నేత లావంగు నవీన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బ్యాగ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గారు మాట్లాడుతూ హరీష్‌రావు జన్మదినం సందర్భంగా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలు అందించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. వెంకటరెడ్డినగర్ డివిజన్ బిఆర్ఎస్ యూత్ నేత లావంగు నవీన్ మాట్లాడుతూ హరీష్‌రావు జన్మదినం సందర్భంగా విద్యార్థులకు ఉపయోగపడే విధంగా స్కూల్ బ్యాగులు పంపిణీ చేయడం ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్తులో కూడా మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు, కార్మిక సంక్షేమ శాఖ మాజీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, సాయిజెన్ శేఖర్, పన్నాల దేవేందర్‌రెడ్డి, గంధం నాగేశ్వర్‌రావు, పసుల ప్రభాకర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు డా.బి.వి.చారి, బోసాని పవన్, సూరం శంకర్, తదితరులు పాల్గొన్నారు.

చిలుకానగర్‌లో..

సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత పిట్టల నరేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో చిల్కానగర్ చౌరస్తాలో ఉచిత వైద్య శిబిరం, దంత వైద్య శిబిరం, మెగా రక్తదాన శిబిరం ఘనంగా నిర్వహించారు. చిల్కానగర్ డివిజన్‌కు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వైద్య సేవలను వినియోగించుకున్నారు. అలాగే బీఆర్ఎస్ యువజన నాయకులు, స్థానిక యువత కలిసి సుమారు 150 మంది రక్తదానం చేసి సామాజిక బాధ్యతను చాటి చెప్పారు. అనంతరం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి రక్తదానం చేసిన యువకులకు రక్తదాత గుర్తింపు కార్డులను అందజేశారు. హరీష్‌రావు జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన కేక్‌ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి బీఆర్ఎస్ పార్టీ పార్లమెంట్ ఇంచార్జీ రాగిడి లక్ష్మారెడ్డి , స్థానిక నాయకులతో కలిసి కేక్ కట్ చేసి పరస్పరం మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, మహిళలు ఇతర నేతలు పాల్గొన్నారు.

ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేసుకోవాలి: గడ్డం లక్ష్మారెడ్డి

ఫారెస్ట్ అధికారులతో కలిసి గుర్రంగూడ సంజీవని పార్కులో సైకిల్ నడిపి ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని ప్రారంభించిన మాజీ కార్పొరేటర్ గడ్డం లక్ష్మారెడ్డి

సరూర్‌నగర్, జూన్ 3 ప్రభాతవార్త: నేటి ఆధునిక సమాజంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన జీవన శైలిని అలవాటు చేసుకోవాలని జిహెచ్ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్ నాదర్‌గుల్ డివిజన్ సీనియర్ బిజెపి నాయకుడు, పాత బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ గుర్రంగూడ మాజీ కార్పొరేటర్ గడ్డం లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం గుర్రంగూడ సంజీవని పార్కులో ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ప్రపంచ సైకిల్ దినోత్సవం (వరల్డ్ బైస్కిల్ డే)ను నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన స్థానిక మాజీ కార్పొరేటర్ గడ్డం లక్ష్మారెడ్డి ఆటవీ శాఖ అధికారులతో కలిసి సైకిల్‌ను నడిపి సైకిల్ దినోత్సవాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేటి సమాజం పోటీ ప్రపంచంగా మారిందనీ దీని వల్ల ఒత్తిడి, మానసిక, శారీరక అలసటకు గురి అయ్యే పరిస్థితి చాలా మందిలో కలుగుతుందని అన్నారు. ఈ నేపథ్యంలో శారీరక రుగ్మతల బారిన పడుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన జీవన శైలిని అలవరుచుకోవాలని లక్ష్మారెడ్డి సూచించారు. ప్రతి రోజూ నడక, వ్యాయామం, యోగా, ధ్యానం వంటి వాటితో పాటు సైక్లింగ్ కూడా చేయాలని అన్నారు. దీని వల్ల శరీరం చురుకుగా ఉండడంతో పాటు గుండె ఆరోగ్యం, మానసిక, శారీరక ఉల్లాసం కలుగుతుందని ఆయన వెల్లడించారు. ప్రభుత్వం స్పందించి పార్కుల్లో అదే విధంగా రోడ్ల పక్కన ప్రత్యేకంగా సైకిల్ ట్రాక్‌లను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. స్టైక్లింగ్ చేయడానికి ప్రత్యేక జోన్లను ఏర్పాటు చేయడం వల్ల ప్రజల్లో సైకిల్ నడపాలనే ఆసక్తి కలుగుతుందని ఆయన పేర్కొన్నారు. పలు దేశాల్లో చాలా మంది సైకిల్ వాడకం పెరుగుతున్నదని ఆయన గుర్తు చేశారు. మన దేశంలో కూడా సైకిల్ నడపడం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని లక్ష్మారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ అధికారులు శ్రీనివాస్‌రెడ్డి, కస్నా నాయక్, సిబ్బందితో పాటు స్థానిక గుర్రంగూడకు చెందిన కొండా హేమంత్‌రెడ్డి, గొరిగె నగేష్, గొరిగె కిషన్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలోనే అధిక ఫీజులు

-ప్రైవేట్ పాఠశాల,కళాశాలలో నిలువు దోపిడి : కొప్పుల

మన్సూరాబాద్, జూన్ 3, ప్రభాతవార్త :

ఎల్.బి.నగర్ లో ప్రైవేట్ పాఠశాలలు,కళాశాలల యాజమాన్యాలు మధ్యతరగతి కుటుంబాల నుండి అధిక ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని గ్రేటర్ మాజీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కొప్పుల నర్సింహ్మా రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మన్సూరాబాద్‌లోని తన కార్యాలయంలో కొప్పుల తో పాటు రంగారెడ్డి జిల్లా బీజే వై ఎం నాయకులు పొట్టపల్లి సాయిరాం గౌడ్ , డివిజన్ బీజే వై ఎం అధ్యక్షులు పారంద సాయి తో పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రైవేట్ పాఠశాలలు మరియు కళాశాలల యాజమాన్యాలు నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజులు భరించలేక తమ పిల్లలను ఇతర విద్యాసంస్థల్లో చేర్పించాలని నిర్ణయించుకున్న తల్లిదండ్రులు ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్లు ఇవ్వాలని కోరినప్పటికీ, కొన్ని యాజమాన్యాలు వాటిని జారీ చేయకుండా అనవసరంగా ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆరోపించారు. విద్య అనేది ప్రతి విద్యార్థి హక్కు అని, దానిని వ్యాపారంగా మార్చి పెద్ద పెద్ద "బ్రాండ్స్" పేరుతో అధిక ఫీజులు వసూళ్లు. తల్లిదండ్రులపై అధిక భారం మోపడం సమంజసం కాదని మండిపడ్డారు. ప్రభుత్వం మరియు విద్యాశాఖ అధికారులు వెంటనే జోక్యం చేసుకుని అధిక ఫీజుల వసూళ్లను నియంత్రించడంతో పాటు, విద్యార్థులకు ఎటువంటి ఆటంకాలు లేకుండా టీసీలను జారీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా ప్రతి ఒక్క ప్రైవేట్ పాఠశాలల్లో యూనిఫామ్,బుక్స్ మరయు ఇతర స్కూలుకు సంబంధించిన మెటీరియల్స్ అని చెప్పి స్కూల్స్ లోనే ప్రతి విద్యార్థి దగ్గర నుండి వేలకు వేలు వసూలు చేస్తున్న విద్యాసంస్థలపై ఎంఈఓ ఈ ఓ లు మరయు విద్యాశాఖ ఉన్నతాధికారులు ఇప్పటివరకు స్పందించడం లేదని అదేవిధంగా ఎలాంటి చర్యలు తీసుకోకుండా వారికి మద్దతుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. నగరంలో స్కూల్ బ్రాండ్ల పేరుతో ప్రతి సంవత్సరం వార్షికోత్సవాల పేరుతో విద్యార్థుల నుండి 2000 నుండి 3000 రూపాయల వరకు వసూలు చేసి వారి స్కూల్ బ్రాండ్ ను పబ్లిసిటీ చేసేందుకు పిల్లల వద్ద నుండి డబ్బులు తీసుకునే నియమాలు ఎక్కడివని డిమాండ్ చేస్తూ వీటిపై వెంబడే సంబంధిత విద్యాశాఖ అధికారులు స్పందించాలని హెచ్చరించారు..అలాగే, నియోజకవర్గంలో ప్రతి విద్యార్థుల తల్లిదండ్రుల సమస్యలను పరిష్కరించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని, అవసరమైతే ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసి మా పార్టీ యువ మోర్చా ఆధ్వర్యంలో ఉద్యమ కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

బాలికతో వృద్ధుడు అసభ్య ప్రవర్తన

- వృద్ధుడుపై కేసు నమోదు..

కుషాయిగూడ జూన్ 3, ప్రభాతవార్త

ఓ మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన వృద్ధుడు పై కేసు నమోదు చేసిన సంఘటన కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు,ఫిర్యాదుదారు తెలిపిన వివరాల ప్రకారం.. తన 14 సంవత్సరాల కూతురు ఇంటికి దగ్గరలో ఉన్న కిరాణా షాప్ కి వెళ్లి వస్తాను అని చెప్పి బయటకు వెళ్ళింది తిరిగి కొద్దిసేపటికి మరలా ఇంటికి వచ్చింది అప్పుడు వారి చుట్టుపక్కల వారు తన ఇంటికి వచ్చి మీ కూతుర్ని ఇస్త్రీ షాప్ లో ఉండే వ్యక్తి తన ఇంట్లోకి తీసుకెళ్లి ముందు షటర్ ని క్లోజ్ చేయడం మేము చూసాము అని చెప్పగా దాంతో అసలు ఏమైంది అని తాను తన కూతుర్ని అడగగా అప్పుడు తన కూతురు తాను షాప్ కి వెళ్లి తిరిగి ఇంటికి వచ్చే సమయంలో ఐరన్ షాప్ లో ఉండే వ్యక్తి తనని ఇంటి లోపలికి పిలిచి ముందు షెటర్ ని క్లోజ్ చేసి తనని ఎక్కడపడితే అక్కడ పట్టుకున్నాడు గత వారం క్రితం కూడా ఇలాగే చేసినాడని వారికి తెలిపింది. కాగా అట్టి వ్యక్తి గురించి తర్వాత వారు విచారించగా అతని పేరు ముడికొండ లింగం వయస్సు 75 సంవత్సరాలు అని తెలిసింది. ఇట్టి విషయమై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పార్కులు, కుంటల సుందరీకరణపై ప్రత్యేక దృష్టి

-మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లో పర్యటించిన ఎమ్మెల్యే, జోనల్ కమిషనర్

అత్తాపూర్ జూన్3 ,ప్రభాతవార్త :

మార్కండేయనగర్, బాబులల్ రెడ్డి నగర్‌ను ఆనుకొని ఉన్న నర్సబాయి కుంటను అభివృద్ధి చేయడానికి అంచనాలు తయారు చేయాలని ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ అధికారులకు సూచించారు. బుధవారం రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డితో కలిసి ఆయన నర్సబాయి కుంట ను పరిశీలించారు. అటు సాయిబాబా నగర్ ఇటు మార్కండేయ నగర్, బాబుల్ రెడ్డి నగర్, వెంకటేశ్వర కాలనీల మధ్య ఉన్నటువంటి నర్సాబాయి కుంటను సుందరంగా తీర్చిదిద్దాలని సూచించారు. అభివృద్ధితో పాటు వాకింగ్ ట్రాక్ చిన్న పిల్లలు ఆడుకోవడానికి ఏర్పాట్లు, ఓపెన్ జిమ్ లాంటి సౌకర్యాలను కల్పిస్తే బాగుంటుందన్నారు. జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, రాజేంద్రనగర్ జోన్ పరిధిలో ఉన్న పార్కుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. అందులో భాగంగానే నర్సబాయి కుంటను పరిశీలించడం జరిగిందని తెలిపారు. త్వరలోనే అంచనాలు తయారు చేసి ఉన్నతాధికారుల సహకారంతో నిధుల మంజూరు కి ఆమోదం పొంది నర్సబాయి కుంటను ప్రజలకు అనుకూలంగా అభివృద్ధి చేస్తామని సోలిపేట శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రూ.70లక్షలతో సిసి రోడ్డు పనులు : బన్నాల గీత

చిలుకానగర్‌లో సిసి రోడ్డు పనులు పరిశీలిస్తున్న మాజీ కార్పొరేటర్ బన్నాల గీత తదితరులు

ఉప్పల్, జూన్ 3 ప్రభాతవార్త : చిలుకానగర్ హనుమాన్ ఆలయం వద్ద రూ. 70 లక్షల వ్యయంతో చేపట్టిన సిసి రోడ్డు పనులను బుధవారం మాజీ కార్పొరేటర్ బన్నాల గీత పరిశీలించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ చిలుకానగర్ డివిజన్‌లో అభివృద్ధి పనులు చేయించామని తెలిపారు. డివిజన్‌లో ప్రణాళిక బద్ధంగా పనులు చేపడుతున్నామని, డ్రైనేజీ, సిసి రోడ్ల నిర్మాణం పనులను పూర్తి చేసుకుంటూ ముందుకు సాగుతున్నామని అన్నారు. అదేవిధంగా జిహెచ్ఎంసి అధికారులు రోడ్డు నిర్మాణ సమయంలో పర్యవేక్షణ ఉండాలని, నాణ్యత ప్రమాణాలు పాటించి ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్స్పెక్టర్ కేదార్ బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, సీనియర్ నాయకులు ఎద్దుల కొండలరెడ్డి, జల్లి మోహన్, రవీందర్ గౌడ్, శ్రీశైలం, మాస శేఖర్, మహమ్మద్, సుందర్, జిల్లాల ప్రవీణ్, నవీన్ గౌడ్ పాల్గొన్నారు.

వెంకటసాయినగర్‌లో సిసి రోడ్డు నిర్మించాలని వినతి

వెంకటసాయినగర్‌లో సిసి రోడ్డు మంజూరు చేయాలని ఎమ్మెల్సీ ఎవిఎన్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న కాలనీ నేతలు

రామంతాపూర్, జూన్ 3 ప్రభాతవార్త : రామంతాపూర్ వెంకట సాయినగర్ కాలనీలో పెండింగ్ లో ఉన్న సీసీ రోడ్లకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ పలువురు కాలనీ నేతలు బుధవారం ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు ఎ. విజయేందర్ రెడ్డి మాట్లాడుతూ కాలనీలో సరైన రోడ్లు లేకపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో రహదారులు పూర్తిగా బురదమయంగా మారి ప్రజలు రాకపోకలు సాగించడంలో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వృద్ధులు, మహిళలు, చిన్నారులు జారి పడే ప్రమాదం కూడా అధికంగా ఉందని ఎమ్మెల్సీ దృష్టికి తీసుకెళ్లారు. కాలనీలో పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్ల నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేసి పనులను త్వరితగతిన చేపట్టేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్సీ ఏ.వి.ఎన్. రెడ్డి సమస్యను సానుకూలంగా పరిశీలిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ సభ్యులు రమేష్ గౌడ్, రవికుమార్, సంజీవ్, ఐలేష్ యాదవ్, రమేష్ యాదవ్, శంకర్, రమేష్ శెట్టి, గోపాల్,సర్వ సత్తయ్యయాదవ్ పాల్గొన్నారు.

గణేష్‌నగర్‌లో ఈదురుగాలులకు విరిగిన చెట్టు కొమ్మలు

రామంతాపూర్ గణేష్‌నగర్‌లో విరిగిన చెట్టు కొమ్మలు పరిశీలిస్తున్న బిజెపి నేత తిండేరు హన్మంతరావు తదితరులు

రామంతాపూర్, జూన్ 3 ప్రభాతవార్త : రామంతాపూర్ గణేష్‌నగర్ జనని హాస్పిటల్ ముందు బుధవారం ఉదయం ఈదురుగాలులకు చెట్టు విరిగి విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. దీంతో మాజీ కౌన్సిలర్, బిజెపి సీనియర్ నేత తిండేరు హన్మంతరావు స్పందించి వెంటనే విద్యుత్, హైడ్రా, అధికారులకు సమాచారం అందించారు. దీంతో అధికారులు అక్కడికి చేరుకుని విరిగిన చెట్టు కొమ్మలు తొలగించారు. ఈ సందర్భంగా తిండేరు హన్మంతరావు మాట్లాడుతూ ఈదురుగాలుల కారణంగా చెట్టు పలు చోట్ల చెట్టు కొమ్మలు విరిగి పడే ప్రమాదం ఉందని, ప్రమాదకరంగా ఉన్న వాటిని కొమ్మలు తొలగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నేతలు సోమ శ్రీనివాసులు, బాలరాజు యాదవ్ పాల్గొన్నారు.

మంచినీటి సమస్య పరిష్కారానికి కృషి

కాలనీవాసులతో మాట్లాడుతున్న చిలుక ఉపేందర్‌రెడ్డి

ఎల్.బి.నగర్, జూన్ 3 ప్రభాతవార్త:

కాలనీలో మంచినీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆర్కేపురం డివిజన్ ఎన్టీఆర్ నగర్‌లోని సాయిబాబానగర్‌లో బుధవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా వేసవి కాలంలో నీటి కొరత వుందని స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న ఉపేందర్ రెడ్డి సంబంధిత జలమండలి డీజీఎం చంద్రునాయక్, అధికారులు, సిబ్బందితో కలిసి విస్తృతంగా పర్యటించి సమస్యలను పరిశీలించారు. స్థానికులు వారికి మంచినీటి సమస్య గురించి వివరించారు. అందుకు స్పందించిన ఉపేందర్‌రెడ్డి జలమండలి అధికారుల ద్వారా త్వరలోనే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హరిబాబు, శ్రీనాథ్, మహేష్, సందీప్, లోకేష్, నర్సింగ్, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

చిత్రాలేఔట్‌లో ఆర్ఆర్ఆర్ సెంటర్ ప్రారంభం

ఆర్ఆర్ఆర్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న పెండ్యాల నగేష్, మధుసూదన్‌రెడ్డి, బోనగిరి శ్రీనివాస్

ఎల్.బి.నగర్, జూన్ 3 ప్రభాతవార్త: ఆర్ఆర్ఆర్ సెంటర్ ద్వారా వృధాను అరికట్టవచ్చని చిత్రాలు లేఔట్ అసోసియేషన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్ పేర్కొన్నారు. ఆర్కేపురం డివిజన్ చిత్రాలే అవుట్‌లో ఓజోన్ ఆసుపత్రి సహకారంతో ఆర్ఆర్ఆర్ సెంటర్ను ఏర్పాటు చేశారు. బట్టలు, పుస్తకాలు, సోఫా సెట్, కుర్చీలు, కూలర్లు, ఇంట్లో వాడని వస్తువులు ఏవైనా ఉంటే ఈ సెంటర్లో పెట్టవచ్చని, అవసరం ఉన్నవాళ్లు ఆ వస్తువులను తీసుకువెళ్లేందుకు అనుకూలంగా ఏర్పాటు చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృధాను అరికట్టడంలో భాగంగా ఈ సెంటర్ను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో ఓజోన్